

ఉరిశిక్షలు ప్రజాస్వామికమేనా? 6

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 3 సంచిక -126 శుక్రవారం 23 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## ఏపీలో పరిషత్ నామినేషన్ల వేళ రణరంగం..

పలుచోట్ల ఘర్షణలు, గాల్లోకి కాల్పులు

కడప జిల్లా నందలూరులో టీడీపీ వర్గాల మధ్య రాళ్లదాడి, గాల్లోకి కాల్పులు

శాంతిభద్రతల దృష్ట్యా కడపలో పలువురు వైసీపీ నేతల అరెస్ట్

ఘర్షణల్లో వాహనాలకు నిప్పు, పలుచోట్ల పోలీసుల లాఠీఛార్జ్



**అమరావతి, అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);** రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. గురువారం పలు జిల్లాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా, మరికొన్ని చోట్ల అంతర్గత వర్గపోరు భగ్గుమంది. రాళ్ల దాడులు, వాహనాలకు నిప్పు పెట్టడం, గాల్లోకి కాల్పులు మిగతాది 2లో...

# కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం

## పండుగ సాయన్న జయంతి సభలో సీఎం రేవంత్




బీసీ-ఏలోకి ముదిరాజ్!

అందర్నీ ఒప్పించి మారుస్తాం

న్యాయ నిపుణులను సంప్రదిస్తాం

వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తాం

సంక్షేమం నాది, ఎన్నికల బాధ్యత మీది

ఇందిరమ్మ ఇల్లు కట్టని ఊర్లో ఓటడగను

బాబు, వైఎస్, కేసీఆర్ పథకాల్ని కొనసాగిస్తూ

గత ప్రభుత్వాల కన్నా రెట్టింపు సంక్షేమం

కులగణనలో తేడాలుంటే చెప్పండి, దిద్దుతాం

రాహుల్ ప్రధానైతే బహుజనులు బాగు

**హైదరాబాద్, అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);** గంగపుత్రులను ఒప్పించి ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతామన్నారు. రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కులగణన లెక్కలు లేనందునే ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు ఇప్పటి వరకు మార్చలేక పోయారని తెలిపారు. ఈ అంశంపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామన్నారు. మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో అధ్యయనం చేయిస్తానని ప్రకటించారు. ఈ అంశంపై ఇతర కులాలకు ఉన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెసును గెలిపించే విషయాన్ని ప్రజలు చూసుకోవాలని, అన్ని వర్గాల సంక్షేమాన్ని తాను చూసుకుంటానని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు ఉన్న ఊర్లోనే తాను వచ్చే ఎన్నికల్లో ఓటు అడుగుతానని ప్రకటించారు. మిగతాది 2లో...



## ఆవిష్కరణల కేంద్రాలుగా భారత్-పోలాండ్

- పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు
- 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యం.
- కీలక ఖనిజాలు, సెమీకండక్టర్ల రంగాల్లో భాగస్వామ్యానికి అంగీకారం.
- ఉగ్రవాదంపై ఉమ్మడిగా పోరాడాలని భారత్, పోలాండ్ నిర్ణయం.

**న్యూఢిల్లీ అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);** భారతదేశ పర్యటనకు వచ్చిన పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం న్యూఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ చర్చల సందర్భంగా ఇద్దరు నాయకులు ద్వైపాక్షిక సంబంధాల పూర్తి పరిధిని సమీక్షించడంతో పాటు పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయమిగతాది 2లో...

## ఏపీ సీఎస్ సాయిప్రసాద్ పదవీకాలం పొడిగింపు..

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఆరు నెలల పాటు సర్వీస్ పొడిగింపు

2027 మే 31వ తేదీ వరకు సీఎస్‌గా కొనసాగనున్న సాయి ప్రసాద్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు సర్కార్ కీలక నిర్ణయం

కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు



## ఐదు జిల్లాల్లో కరువుకు రేవంత్‌రెడ్డే కారణం

కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు



## హైదరాబాద్‌లో ఘనంగా అలయ్ బలయ్



ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించిన వెంకయ్యనాయుడు

రాజకీయాలకు అతీతంగా హాజరైన వివిధ పార్టీల నేతలు

'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' ఇతివృత్తంతో కార్యక్రమం

**హైదరాబాద్ అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);** ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మిగతాది 2లో...

## కత్తిపూడి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

పాదయాత్రగా వెళ్తున్న భవానీ భక్తులపైకి దూసుకెళ్లిన స్కార్పియో

ప్రమాదంలో నలుగురు భక్తులు అక్కడికక్కడే మృతి

విజయవాడ దుర్గమ్మ దర్శనానికి వెళ్తుండగా జరిగిన విషాదం

గాయపడిన మరో ఇద్దరిని ఆసుపత్రికి తరలించిన స్థానికులు



**కాకినాడ అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);** కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న భవానీ మాలధారులపైకి ఓ స్కార్పియో వాహనం దూసుకెళ్లడంతో నలుగురు భక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కత్తిపూడి మండలం రవికంపాడు జంక్షన్ సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మిగతాది 2లో...

## వరంగల్ కోట అభివృద్ధికి రూ. 382 కోట్లు

వరంగల్ కోట అభివృద్ధికి ప్రభుత్వ పరిపాలన అనుమతులు

మొత్తం రూ. 382 కోట్ల విలువైన పనులకు గ్రీన్ సిగ్నల్

వేయి స్తంభాల గుడి, బస్ టెర్మినల్ వంటి పనులకు ఆమోదం

ప్రపంచ బ్యాంకు నిధులతో 'కుడా' ఆధ్వర్యంలో పనుల నిర్వహణ

చారిత్రక ప్రదేశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

**హైదరాబాద్, అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);** కాకతీయ వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఖిల్లా వరంగల్‌తో పాటు హనుమకొండ నగరంలోని కీలక ప్రాంతాల్లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 382 కోట్ల కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఖిల్లా వరంగల్ పునరుద్ధరణ, సెంట్రల్ ప్లాజా నిర్మాణం, బస్ టెర్మినల్, వేయి స్తంభాల ఆలయం పరిసరాల అభివృద్ధి,మిగతాది 2లో...



# ఏపీ సీఎస్ సాయిప్రసాద్ పదవీకాలం పొడిగింపు..

**అమరావతి, అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఆరు నెలల పాటు పొడిగించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (ఐశీూ) గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన 2027 మే 31వ తేదీ వరకు ఇదే హోదాలో కొనసాగనున్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పరిపాలనా సౌలభ్యం కోసం సీఎస్ పదవీకాలాన్ని పొడిగించాలని చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించింది.
1991 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన గోపీకృష్ణ సాయిప్రసాద్ ఈ ఏడాది నవంబర్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిపాలనాపరమైన అవసరాలు, ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఆయన సేవలను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో సెప్టెంబర్ 29న కేంద్రానికి ప్రత్యేకంగా ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం, ఆల్ ఇండియా సర్వీసెస్ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక మినహాయింపులు ఇచ్చింది. డెత్-కమ్-రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూల్స్, 1958లోని రూల్ 16(1)కి సడలింపునిస్తూ, క్యాడర్ రూల్స్, 1960లోని రూల్ 3 ప్రకారం ఈ పొడిగింపును మంజూరు చేసింది. డిసెంబర్ 1, 2026 నుంచి మే 31, 2027 వరకు ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తున్నట్లు కేంద్ర అండర్ సెక్రటరీ రాజేశ్ కుమార్ యాదవ్ సంతకంతో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఉత్తర్వుల కాపీలను ప్రధానమంత్రి కార్యాలయం (ూమీ), ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం సహా సంబంధిత శాఖలకు పంపించారు. ఈ నిర్ణయంతో, కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పరిపాలనలో అనుభవజ్ఞుడైన అధికారి కొనసాగేందుకు మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి సాయి ప్రసాద్ నాయకత్వం అందించడం ద్వారా పరిపాలనలో స్థిరత్వం, కొనసాగింపు ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

# దేవరగట్టు కర్రల సమరంలో మరోసారి హింస

**కర్నూలు /హోళగుంద అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త):** కర్నూలు జిల్లా దేవరగట్టులో ఏటా జరిగే కర్రల సమరంలో మరోసారి రక్తం చిందింది. దసరా పండుగ మరుసటి రోజు రాత్రి నిర్వహించిన బన్నీ ఉత్సవంలో తీవ్ర హింస చెలరేగింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, 100 మందికి పైగా భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయం పేరిట జరుగుతున్న ఈ ఉత్సవం మరోసారి విషాదాన్ని మిగిల్చింది. వివరాల్లోకి వెళితే.. హోళగుంద మండలం దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను కొండపై నుంచి కిందకు తీసుకొస్తుండగా ఈ ఘర్షణ చోటుచేసుకుంది. స్వామివారి విగ్రహాలను దక్కించుకునేందుకు 11 గ్రామాల ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయి కర్రలు, దివిటీలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు.



ఈ భీకర సమరంలో తలలు పగిలి, తీవ్ర రక్తస్రావమైనా ఎవరూ వెనక్కి తగ్గలేదు. ఈ ఘర్షణలో ఆలూరుకు చెందిన పోతురాజు అనే వ్యక్తి మృతి చెందాడు. గాయపడిన వందలాది మందిని హుటాహుటిన ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రతి ఏటా విజయదశమి మరుసటి రోజు అర్ధరాత్రి దేవరగట్టులో ఈ బన్నీ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. మాళమ్మ, మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను దక్కించుకోవడమే ఈ సమరం వెనుక ఉన్న సంప్రదాయం. ఈ ఉత్సవం కోసం ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ ఉత్సవంలో హింసకు తావులేకుండా చూడాలని పోలీసులు, జిల్లా అధికారులు ఏటా పెద్ద ఎత్తున అవగాహన కల్పించి, భారీ బందోబస్తు ఏర్పాటు చేసినా ఫలితం ఉండటం లేదు. భక్తుల రూపంలో కర్రలను ఆలయ పరిసరాలకు తరలించి, అర్ధరాత్రి సమయానికి దాడులకు దిగుతున్నారు. సంప్రదాయం పేరిట ఏటా జరుగుతున్న ఈ రక్తపాతాన్ని నివారించడం అధికారులకు సవాలుగా మారింది. ప్రాణాలు పోతున్నా ఈ ఆచారాన్ని కొనసాగించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

# హైదరాబాద్‌లో ఘనంగా అలయ్ బలయ్

(మొదటి పేజి తరువాయి)

ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి,



బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' సాధనను దేశ ప్రజలందరూ తమ ఉమ్మడి జాతీయ లక్ష్యంగా మలుచుకోవాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు. 'నషా ముక్త్ భారత్ – వికసిత్ భారత్' (మత్తుపదార్థాల రహిత – అభివృద్ధి చెందిన భారతదేశం) అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహూతులను అలరించాయి.

# కత్తిపూడి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



(మొదటి పేజి తరువాయి)

వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లాకు చెందిన కొందరు భవానీ భక్తులు విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం కోసం బస్సులో బయలుదేరారు. మార్గమధ్యంలో బస్సులో సాంకేతిక లోపం తలెత్తడంతో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశారు. ఈ క్రమంలో టీ తాగేందుకు సమీపంలోని హోటల్‌కు భక్తులు నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ స్కార్పియో వాహనం అదుపుతప్పి వారిపైకి దూసుకెళ్లింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో నలుగురు భక్తులు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## వరంగల్ కోట అభివృద్ధికి రూ. 382 కోట్లు

(మొదటి పేజి తరువాయి)

మ్యూజికల్ గార్డెన్ వంటి కీలక ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ పనులన్నింటినీ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పర్యవేక్షణలో నిర్వహించనుండగా, ప్రాజెక్టుల అమలుకు ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించనున్నారు. వరంగల్ ప్రాంతంలోని చారిత్రక కట్టడాలు పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే విస్తృత ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పర్యాటక రంగంలో వరంగల్ నగరానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు, నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

## ఐదు జిల్లాల్లో కరువుకు రేవంత్‌రెడ్డే కారణం

### కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

### బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు

**గజ్వేల్, అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);** రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో కరువుకు సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థతనే కారణమని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో నీళ్లు, కరెంట్ లేక ఎండిపోయిన వరి పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరంగల్ జిల్లాలకు ప్రాణాధార అయిన గోదావరి నుంచి దేవాదుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు 24గంటల పాటు మోటార్లను ప్రభుత్వం ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. శ్రీశైలంలో నీళ్లున్నా అక్కడా 9గంటలే మోటార్లను నడిపిస్తున్నారని విమర్శించారు. మూడేళ్లుగా కాళేశ్వరం 2వ టీఎంసీ పనులను ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అక్కడ పనులు పూర్తి చేస్తే మల్లన్నసాగర్ నిండుకుండలా ఉండేదని, అందుకే ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని విమర్శించారు. కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ. 12వేలు అందించాలని, మరో 20రోజుల పాటు పంటలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, సాగునీటిని అందించి పంటలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# ఆవిష్కరణల కేంద్రాలుగా భారత్-పోలాండ్

(మొదటి పేజి తరువాయి)

ప్రపంచ సమస్యలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సంయుక్త పత్రికా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, ప్రపంచం అనిశ్చితి, పరివర్తన కాలం గుండా వెళ్తోందని, ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ భారత్, పోలాండ్ దేశాలు అభివృద్ధి, సాంకేతికత, ఆవిష్కరణలకు ముఖ్యమైన కేంద్రాలుగా ఆవిర్భవిస్తున్నాయని అన్నారు. రక్షణ, అంతరిక్షం, అణుశక్తి రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించాయని తెలిపారు. ఈ వ్యూహాత్మక రంగాల్లో భారతదేశంతో కలిసి సహ అభివృద్ధి, సహ ఉత్పత్తిలో పాలుపంచుకోవాలని పోలాండ్ కంపెనీలను మోదీ ఆహ్వానించారు.
అంతకుముందు భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పోలాండ్ ప్రధానమంత్రి టస్క్‌తో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రపంచానికి విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడంతో పాటు, 2030 నాటికి భారత్‌పోలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుత స్థాయి నుంచి రెట్టింపు చేయాలని ఇరు దేశాల ప్రధానులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలు, సైబర్ భద్రత, రక్షణ రంగంలో ఆవిష్కరణలకు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల పునర్వినియోగ పరిశ్రమల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ముఖ్యంగా బ్యాటరీల రీసైక్లింగ్, అరుదైన భూ మూలకాల శుద్ధి ప్రక్రియలకు ప్రాధాన్యం ఇవ్వనున్నాయి. భూగర్భ గనుల తవ్వకం, కీలక ఖనిజాల రంగాల్లోనూ సహకారాన్ని విస్తరించేందుకు అవకాశాలను గుర్తించాయి. ఈ రంగాలకు సంబంధించి పరస్పర అవగాహన ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి. స్వేచ్ఛాయుత, బహిరంగ, శాంతియుత, సుసంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం కృషి చేయాలని ఇరు దేశాలు పునరుద్ఘాటించాయి. భారత్‌పోలాండ్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో అంతరిక్ష రంగంలో ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమల మధ్య సంబంధాలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. అన్ని రూపాల్లోని ఉగ్రవాదాన్ని, హింసాత్మక తీవ్రవాదాన్ని ఇరు దేశాలు తీవ్రంగా ఖండించాయి. సరిహద్దుల అవతలి నుంచి జరిగే ఉగ్రవాద కార్యకలాపాలపైనా ఆందోళన వ్యక్తం చేశాయి. గత ఏడాది ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదానికి నిధులు అందించే నెట్‌వర్క్‌లను విచ్ఛిన్నం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాయి.

# కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం

(మొదటి పేజి తరువాయి)

ఇల్లులేని పేదల కోసమే తమ సర్కారు 8 లక్షల ఇళ్లనుకట్టిస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాల కన్నా రెట్టింపు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని సీఎం ప్రస్తావించారు. ఎన్టీఆర్ రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తే తాము సన్నబియ్యం ఇస్తున్నామని, అదీ ఏకంగా 3.48 కోట్ల మందికి అందిస్తున్నామని చెప్పారు.
ఎన్టీఆర్, చంద్రబాబు, వై.ఎస్., కేసీఆర్‌లు ప్రవేశపెట్టిన మంచి పథకాలను ఎటువంటి వివక్ష లేకుండా అమలు చేస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు ఉచిత బస్సు, రైతు పెట్టుబడి అమలు చేస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేశామని, బీసీ కుల గణన చేపట్టామని తెలిపారు. ఏ కులం వారైనా సరే తమ లెక్క తప్పుగా ఉందని భావిస్తే గణాంకాల్లోకి రానివారి వివరాలు తీసుకువచ్చి ఇవ్వాలని కోరారు. కులగణన లెక్కల్లో తేడాలుంటే వివరాలు ఇవ్వాలని, వాటిని రానున్న కేబినెట్ భేటీలో చర్చించి సరిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని చెప్పారు. ఆ వివరాలను పరిశీలించి జాబితాలో కలుపుతామని, దీనిపై వచ్చే కేబినెట్‌లో చర్చిస్తామని అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా ముదిరాజులేనని, వారు ఎంతో విశ్వసనీయమైన వారని వ్యాఖ్యానించారు. 1999లో తాను తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ పడినపుడు ముదిరాజులే అండగా నిలిచారని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. తాను పీసీసీ అధ్యక్షుడిని కాగానే శ్రీహరి ముదిరాజ్‌ను డీసీసీ ప్రెసిడెంట్‌గా నియమించానని, ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో పాటు, మంత్రి పదవి కూడా కల్పించామని, ముదిరాజ్ బిడ్డ నీలం మధుకు సైతం ఎంపీ టికెట్ ఇచ్చామని ప్రస్తావించారు. ముదిరాజ్‌లకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు.
సన్న వడ్లు పండించాలన రైతులకు చెబితే కొందరు అవహేళన చేశారని, ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు అమాంతంగా పెరిగిపోయాయని, ఇది రైతులకు ప్రయోజనం కలిగించే అంశమని చెప్పారు. బహుజనుల జీవితాలు బాగుపడాలంటే రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నారు. రాహుల్‌కు అండగా నిలవాలని ముదిరాజ్‌లను కోరారు. సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. భూస్వాములు తన భూమిని ఆక్రమించుకునప్పుడు పండుగ సాయన్న ఎదురు తిరిగారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. పండుగ సాయన్నను నిజాం పోలీసులు అరెస్టు చే+స్త నాటి వనపర్తి మహారాణి పెద్ద ఎత్తున నిధులు చెల్లించి సాయన్నను విడిపించారని తెలిపారు. ట్యాంక్ బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్యల విగ్రహాలను ఆవిష్కరిస్తామన్నారు.

# ఏపీలో పరిషత్ నామినేషన్ల వేళ రణరంగం..

(మొదటి పేజి తరువాయి)

జరపడంతో పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే, కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని నందలూరులో పరిస్థితి అదుపుతప్పింది. టీడీపీలోని రెండు వర్గాలు తమ అభ్యర్థులే నామినేషన్ వేయాలని పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. టీడీపీ అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, మరో నేత విజయసాగర్ వర్గీయుల మధ్య మొదలైన వాగ్వాదం తీవ్ర ఘర్షణకు, రాళ్ల దాడికి దారితీసింది. ఈ ఘటనలో ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆగ్రహంతో ఓ కారుకు నిప్పు పెట్టారు. ఈ క్రమంలో బాలసుబ్రమణ్యం గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరపడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జ్



చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.
మరోవైపు, మార్కాపురం జిల్లా కనిగిరిలో నామినేషన్ల కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరినే అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడికి యత్నించడంతో అక్కడ టెన్షన్ వాతావరణం ఏర్పడింది. యర్రగొండపాలెంలోనూ టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరగగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.
ఇక కడప జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలను అరెస్ట్ చేసి అట్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ కూడా ఉద్రిక్తత నెలకొంది.

# వరి సాగుకు ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు!

## తక్కువ నీటితో అధిక ప్రయోజనాలు పొందాలి -ఖేతి బచావో అభియాన్‌పై మంత్రి తుమ్మల దిశానిర్దేశం

**ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరోఅక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** యాసంగిలో నీటి వనరులపై ఒత్తిడి తగ్గించి.. పంట భూముల సారాన్ని కాపాడుకుంటూ సాగు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. వరి సాగుకే పరిమితం కాకుండా తక్కువ నీటితో పండే పప్పు దినుసులు, కూరగాయల సాగువైపు మళ్లాలని పిలుపునిచ్చారు. భూసార పరిరక్షణ, సహజ వ్యవసాయం, జీవ ఎరువుల వినియోగమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఖేతి బచావో అభియాన్‌లో భాగంగా గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు.

**తక్కువ నీటితో సాగుకు ప్రాధాన్యం**

యాసంగిలో వరి సాగుకు బదులుగా రెండు మూడు తడులతో పండించే పెసర, మినుములు, ఇతర అనుకూల పంటలతో పాటు కూరగాయలను సాగు చేయాలని మంత్రి సూచించారు. భూమిలో పోషక విలువలను తెలుసుకునేందుకు మట్టి పరీక్షలు చేయించుకోవాలని, రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ జీవ ఎరువులు, సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పంటల ఎంపికలో నీటి లభ్యత, నేల స్వభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.





**వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు**

ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి, పెద్దపెండ్యాల, ధర్మసాగర్ రైతు వేదికల నుంచి రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మసాగర్ రైతు వేదికలో హనుమకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు ఆది రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు దివ్య, రాజేందర్, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పండుగల వేడుకలకు పోలీసుల భద్రతా చేయూత

### అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు..

### సీఐ శ్రీనివాస్‌కు సర్పంచ్, పాలకవర్గం సన్మానం




**ధర్మసాగర్/ అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** పండుగల వేడుకలు ప్రశాంతంగా సాగాలంటే పోలీసుల భద్రత, సమన్వయం కీలకమని చాటిచెప్పేలా ధర్మసాగర్‌లో నిర్వహించిన చిన్న బతుకమ్మ, సద్దుల బతుకమ్మ, దసరా రావణాసుర వధ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు సహకరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐని శాలువాతో ఘనంగా సన్మానించారు. పండుగల వేళ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల సహకారం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

# మృతుడి కుటుంబానికి గౌడ సంఘం పరామర్శ



**ఎల్కతుర్తి/అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**ఇటీవల మృతి చెందిన గౌడ గీత కార్మికుడి కుటుంబాన్ని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎల్కతుర్తి గ్రామానికి చెందిన మండల కల్లుగీత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు శ్రీపతి సదానందం గౌడ్ తల్లి శ్రీపతి రాజమ్మ దశదిన కార్యక్రమానికి హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌని సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ, కుటుంబానికి కలిగిన నష్టం తీరనిదని అన్నారు. ఈ కష్ట సమయంలో భగవంతుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు జనగాని లక్ష్మీనారాయణ గౌడ్, గౌరవ సలహాదారు గొడిశాల యాదగిరి గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు మోటపోతుల రాజు గౌడ్, పంజాల సాంబరాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, జనగాని ప్రవీణ్ గౌడ్, జనగాని సురేష్ గౌడ్, కందాల నగేష్ గౌడ్‌తో పాటు పలువురు గీత కార్మికులు పాల్గొన్నారు.

# మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి -అక్టోబర్ 26న చలో హైదరాబాద్

**కేసముద్రం/అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
గ్రామపంచాయతీ కార్మికులపై అమలవుతున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మిక రంగంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లే జయరాజు డిమాండ్ చేశారు. ఈ నెల 26న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు దాసరి ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జయరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచే చర్యలతో కార్మికులకు నష్టం కలుగుతోందని అన్నారు. కార్మికులకు న్యాయం జరిగేలా నాలుగు కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.
రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను వారి ప్రయోజనాలకే వినియోగించాలని, సంక్షేమ బోర్డును ప్రైవేటుపరం చేయకూడదని కోరారు. 2024 సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంతో పాటు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.




గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని జయరాజు కోరారు. రాష్ట్రంలోని పలువురు గ్రామపంచాయతీ కార్మికుల పేర్లు ఇప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారి పేర్లను నమోదు చేయాలని అన్నారు. కార్మికుల వేతనాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.
ఎల్‌నినో ప్రభావంతో పనులు దొరకక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రేషన్ దుకాణాల ద్వారా పప్పులు, నూనె, పసుపు, చింతపండు తదితర నిత్యావసర వస్తువులను ప్రజలకు అందించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, రైతులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
అక్టోబర్ 26న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో అనబత్తుల లక్ష్మయ్య, వేముల శంకర్, మాచర్ల సతీష్, బేతు రమేష్, మాచర్ల శంకర్, పోలేపాక శ్రీనివాస్, మండి ప్రవీణ్, మరియదాసు, పోలేపాక వెంకన్న, తాంద్ర అనిల్, వై. సందీప్, మహంకాళి వెంకన్న, సారయ్యతో పాటు గ్రామపంచాయతీ కార్మికులు, ఉషాలు, సరస్వతి, లావణ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగ పిల్లల మధ్య మాధవరపు నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు

## మదర్ థెరిస్సా సేవా సదనంలో కేక్ కట్ చేసి అన్నదానం

**మధిర/అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
సామాజిక సేవకులు, విశ్రాంత ఎంపీడీవో మాధవరపు నాగేశ్వరరావు తన పుట్టినరోజును మానసిక దివ్యాంగ పిల్లల మధ్య జరుపుకున్నారు. మధిర నియోజకవర్గ పరిధిలోని మదర్ థెరిస్సా సేవా సదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి, అనంతరం వారికి అన్నదానం నిర్వహించారు. షేర్ సంస్థ బాధ్యులు గోపాల్ రెడ్డి, హనుమంతరావుతో కలిసి మాధవరపు నాగేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవా సదనం నిర్వాహకురాలు నల్లపు స్వర్ణలత మాట్లాడుతూ.. పుట్టినరోజు వేడుకలను మానసిక దివ్యాంగ పిల్లల మధ్య జరుపుకోవడంతో పాటు వారికి అన్నవితరణ చేయడం అభినందనీయమన్నారు. నాగేశ్వరరావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రతిరోజూ ఎవరో ఒకరికి సాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న ఆయన సేవా దృక్పథాన్ని కొనియాడారు. మంచి మనసుతో పిల్లలకు అన్నదానం ఏర్పాటు చేసిన నాగేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని స్వర్ణలత కోరారు. ఈ కార్యక్రమంలో షేర్ సంస్థ బాధ్యులు గోపాల్ రెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.




# రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం

### -వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులకు మంత్రి తుమ్మల సూచనలు

### -పత్తి మద్దతు ధర కొనుగోలు, భూసార పరీక్షలు, పంటల వైవిధ్యీకరణపై దిశానిర్దేశం

**జనగామ/చేర్యాల, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయ రంగంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ, శాస్త్రవేత్తల సూచనలు పాటించి పంటల సాగులో నష్టాలను తగ్గించుకోవాలని దిశానిర్దేశం చేశారు.
గురువారం చేర్యాల మండలం ముత్యాల గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృశ్యమాధ్యమ సమావేశం ద్వారా అధికారులతో పాటు రైతులకు పలు అంశాలపై మార్గదర్శనం చేశారు. వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**మద్దతు ధరపై అవగాహన.. సాగులో శాస్త్రీయ పద్ధతులు**

పత్తి పంటకు కనీస మద్దతు ధరతో కొనుగోలు, 'ఖేత్ బచావో అభియాన్', ప్రకృతి ఆధారిత వ్యవసాయ విధానాలు, శాస్త్రవేత్తల ప్రసంగాలు, రైతుల భూసార పరీక్షలు, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై సమావేశంలో వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం, పంటలకు అనువైన సాగు పద్ధతులను ఎంచుకోవడం ద్వారా పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, వ్యవసాయ శాఖ సూచనల అమలుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు.




**రైతులకు చేరువగా వ్యవసాయ శాఖ**

గ్రామస్థాయిలో రైతు వేదికల ద్వారా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ప్రభుత్వ కార్యక్రమాలు, శాస్త్రీయ సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. రైతులు తమ సందేహాలను వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన సలహాలు పొందాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రావ్య, ముత్యాల, వీరన్నపేట, చుంచనకోట గ్రామాల సర్పంచులు రజిత, వరిష్, శైలజ, శివశంకర్, గొర్రె శ్రీనివాస్, ఉపసర్పంచ్ కమలాకర్, మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి, వార్డు సభ్యులు అజహర్ అహ్మద్, జగన్, కేసిరెడ్డి, ముత్యం రెడ్డి, బత్తిని వెంకటేశ్వర్లు, ఉత్తుకం నరసయ్య, అల్లిబిల్లి రాములు తదితరులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

## చిల్పూర్ ఎంపీడీవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి



**స్టేషన్ ఘన్‌పూర్/ అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** నిజమైన లబ్ధిదారులను గుర్తించి అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ చిల్పూర్ మండల ఇన్‌చార్జి మాలోతు రమేష్ నాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చిల్పూర్ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాలోతు రమేష్ నాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. గుడిసెలు, పెంకుటిళ్లలో నివసిస్తూ సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు కాలేదని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి నిజమైన పేదలను గుర్తించాలని, ఎలాంటి పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ బత్తుల రాజన్ బాబు, లింగంపల్లి, కొండాపూర్, కృష్ణాజిగూడెం గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ అధ్యక్షులు, పార్టీ ఇన్‌చార్జులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సారయ్య కుటుంబానికి ఎమ్మెల్యే రూ.లక్ష సాయం

### కష్టకాలంలో కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం. నాగరాజు

**వర్ధన్నపేట/అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సారయ్య కుటుంబానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. మాజీ కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త సారయ్య మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దహన సంస్కారాలు, ఇతర ఖర్చుల కోసం తనవంతుగా ఆర్థిక సాయం అందించారు. ఖర్చులకు సంబంధించిన ఏర్పాట్ల బాధ్యతలను స్థానిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్‌కు అప్పగించారు. సారయ్య మృతి పార్టీకి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



# నర్సంపేట నుంచి తెలంగాణ రక్షణ సేనలోకి భారీగా చేరికలు

**బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలకు ఆహ్వానం**



**నర్సంపేట/ అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**నర్సంపేట నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. వివిధ మండలాల నుంచి తరలివచ్చిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులకు తెలంగాణ రక్షణ సేన మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ బోడ అనిల్ కుమార్ నాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన 'పంచజన్యం' కార్యక్రమాన్ని గడపగడపకు తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పిస్తామని నాయకులు తెలిపారు. నర్సంపేట నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇతర పార్టీలకు చెందిన మరింత మంది నాయకులు, కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించి తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు.

## దాడిలో గాయపడిన ఒగ్గు రాజుకు ఏఎంసీ చైర్మన్ పరామర్శ

**బాధితుడికి అండగా ఉంటాం.. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి**



**జనగామ/బచ్చన్నపేట, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**దసరా పండుగ సందర్భంగా జరిగిన దాడిలో గాయపడిన లింగంపల్లి గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు ఒగ్గు రాజును చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. గురువారం గ్రామంలోని రాజు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తాము అండగా ఉంటామని, ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. రాజుపై దాడికి పాల్పడిన వారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ పరామర్శలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ మసూద్, మార్కెట్ డైరెక్టర్ గార్లపాటి మైపాల్ రెడ్డి, బచ్చన్నపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హరీష్, కొడవటూరు ఆలయ మాజీ చైర్మన్ మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్మారకార్థం నేడు రక్తదాన శిబిరం

**పాలకుర్తిలో వర్ధన్నపేట పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహణ**

**పాలకుర్తి/అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త):** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన అమర పోలీసుల స్మారకార్థం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నేడు పాలకుర్తిలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ నుంచి పాలకుర్తికి బస్సు బయలుదేరుతుందని తెలిపారు. వివరాలకు అజయ్ (7729975925), దామోదర్ (9676831124), శ్రీకాంత్ (9951126790)లను సంప్రదించాలని సూచించారు.

## అంబేద్కర్‌నగర్‌లో ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

**గ్రామాల్లో విద్యార్థులను చైతన్యపరచాలి. -బిర్రు మహేందర్ మాదిగ**



**వర్ధన్నపేట/అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట మండలం అంబేద్కర్‌నగర్‌లో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నూతన గ్రామ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మహాజన నేత, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశానికి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చాడ కరుణాకర్ మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ గ్రామాల్లోని మాదిగ విద్యార్థులను చైతన్యపరిచి, విద్యార్థి సంఘాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎఫ్ అంబేద్కర్‌నగర్ గ్రామ అధ్యక్షుడిగా మునిగ చరణ్ మాదిగ, అధికార ప్రతినిధిగా చిటూరి శ్రీకాంత్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా మారపాక అక్షయ్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా జోగు అనిరుద్ మాదిగ, చాడ సుశాంత్ మాదిగ, మునిగ రాము మాదిగ, చింత వివేక్ మాదిగ, ఇల్లందుల సాత్విక్ మాదిగ, ఇల్లందుల హర్ష మాదిగ, జోగు రోహిత్ మాదిగ, మారెపల్లి చంటి మాదిగ, బంక పవన్ మాదిగ, కంజర్ల అఖిల్ మాదిగలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంబేద్కర్‌నగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మారపాక బాబు మాదిగతో పాటు విద్యార్థులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాలకు అండగా నిలిచిన యోధుడు పండుగ సాయన్న



**జనగామ/అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
సామాజిక అసమానతలకు, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతూ అణగారిన వర్గాలకు అండగా నిలిచిన యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అధికారికంగా పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను నిర్వహిస్తోందని తెలిపారు.
ఈ సందర్భంగా గురువారం జనగామ జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూ బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దొరలు, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల ఆధిపత్యానికి ఎదురొడ్డి అణగారిన ప్రజల కోసం పోరాడిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్షాలం, మున్సిపల్ చైర్‌పర్సన్ కాటమంచి బాలమణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం కట్టయ్య, ఉపాధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సదానందం, సీనియర్ పాత్రికేయుడు కన్నా పరశురాములు గౌడ్, కల్నల్ బిక్షపతి, కురుమ సంఘం నాయకుడు మల్లేశం, ఆర్య క్షత్రియ సంఘం నాయకుడు ప్రభాకర్, నాయకులు వెంకటయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్ విజయ్‌కు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సన్మానం



**తల్లాడ/ అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన నారపోగు రమేష్‌బాబు కుమారుడు నారపోగు విజయ్‌ను సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ సన్మానించారు. యూట్యూబ్ ద్వారా సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, సామాజిక సేవలో తనవంతు పాత్ర పోషిస్తున్న విజయ్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ యూట్యూబ్ ద్వారా రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, పేదలకు సహాయ కార్యక్రమాలు వంటి సేవా కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. యూట్యూబ్ వ్యాఖ్యాతగా పనిచేస్తూ సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్న తనను ఎమ్మెల్యే గుర్తించి సన్మానించడం ఆనందంగా ఉందని విజయ్ పేర్కొన్నారు.

# పండుగ సాయన్న ఆశయాలను కొనసాగించాలి

**ఘనంగా 174వ జయంతి వేడుకలు**





**వర్ధన్నపేట/అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త):**పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పిట్టల భాస్కర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. గురువారం వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామ గాంధీ సెంటర్‌తోపాటు వర్ధన్నపేట ముదిరాజ్ కమ్యూనిటీ హాలు, అంబేద్కర్ సెంటర్‌లో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి, పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పండుగ సాయన్న నాటి పెత్తందారులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పీడిత ప్రజల పక్షాన నిలిచిన మహావీరుడని కొనియాడారు. ముదిరాజ్ సమాజంతోపాటు బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. సాయన్న ఆశయాల సాధనకు సమాజమంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ఇల్లందలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు సంగినేని భీంరాజ్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు పిట్టల భాస్కర్ ముదిరాజ్, కార్యదర్శి పొన్నం స్వామితోపాటు పలువురు కుల పెద్దలు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. వర్ధన్నపేటలో జరిగిన వేడుకల్లో మండల ఉపాధ్యక్షుడు నారెల్లి సుధాకర్, కార్యదర్శి పొన్నం స్వామి, యువజన విభాగం అధ్యక్షుడు కుక్కల రాకేశ్, ఉపాధ్యక్షుడు బాతు సతీశ్, కార్యదర్శి ముద్రబోయిన సాంబరాజు, సొసైటీ అధ్యక్షుడు భూమా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ముప్పు.. ఆరుతడి పంటలే మేలు

**రైతులకు మంత్రి తుమ్మల సూచనలు**





**వర్ధన్నపేట/అక్టోబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగి సీజన్‌లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలున్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వర్ధన్నపేట మండలం ఇల్లందలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య వీక్షించారు. వరికి బదులుగా శనగ, పెసర, మినుము, వేరుశనగ, జొన్న, సద్దలు, కూరగాయలు, పూలతోటల సాగును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. పంట మార్పిడి ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతోపాటు నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంచుకోవాలన్నారు. వాగులు, చెరువులు, చెక్‌డ్యాంలు, బావులు, బోర్లలోని నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత పెరిగే అవకాశమున్నందున ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించేలా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని పేర్కొన్నారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, రాజకీయాలకు అతీతంగా రైతులకు అండగా నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పాలకుర్తి సారంగపాణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కర్ర మాలతి రెడ్డి, నునావత్ నాను నాయక్, ఎద్దు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం

అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);
సిరిసిల్లలో త్వరలో నిర్వహించనున్న 'జానపద జాతర' కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ను నిర్వాహకులు ఆహ్వానించారు. తెలంగాణ జానపద పరిశ్రమ ఆధ్వర్యంలో ఈ వేడుకను సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు.
ఈ మేరకు తెలంగాణ జానపద పరిశ్రమ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్, ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి కేటీఆర్‌ను కలుసుకొని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ కళాకారులతో ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, జానపద కళలను కాపాడటంలో కళాకారులు చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.
ముఖ్యంగా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో జానపద కళాకారులు తమ పాటలు, ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం నింపారని, మలిదశ ఉద్యమంలో వారి పాత్ర ఎంతో కీలకమని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ జానపద జాతరలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి కళాకారులు పాల్గొని తమ కళలను ప్రదర్శించనుండటం అభినందనీయమన్నారు. తెలంగాణ గొప్ప జానపద వారసత్వాన్ని చాటిచెప్పే ఈ వేడుకల విజయవంతానికి తన పూర్తి సహకారం అందిస్తానని ఆయన నిర్వాహకులకు హామీ ఇచ్చారు.

# సూపర్ ఎల్‌నినో వచ్చినా విద్యుత్ కొరత రావొద్దు

**జెన్‌కో ప్లాంట్లలో రోజుకు 140 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయాలి**

**యాదాద్రి ప్లాంటులో 2 యూనిట్లకు కోల్ ఇండియా నుంచి బొగ్గు**

**సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);** ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున కొరత రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో వచ్చినా సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. వ్యవసాయ, గృహ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో రోజుకు 140 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్దేశించారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిలు తదితర అంశాలపై ఆ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క గురువారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, ఈ నెల 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశామని జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్ వివరించారు. దీన్ని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచాలని భట్టి సూచించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా బొగ్గు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వచ్చే నెల నుంచి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. యాదాద్రి విద్యుత్ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఐదో యూనిట్‌ను ఈ



నెల 20న గ్రిడ్‌కు అనుసంధానించామని అధికారులు తెలిపారు. మిగిలిన సాంకేతిక, నిర్వహణాపరమైన సమస్యలను పరిష్కరించి పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి త్వరలోనే తీసుకొస్తామని చెప్పారు.రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపునకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం అమలు చేయాలని భట్టి ఆదేశించారు. బకాయిల చెల్లింపును సులభతరం చేసి, వినియోగదారులకు ప్రయోజనం కలిగించేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా అర్హత కలిగిన పరిశ్రమలకు బకాయిల చెల్లింపుల్లో కొంతమేర వెసులుబాటు లభించడంతో పాటు, విద్యుత్ పంపిణీ సంస్థలకు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లకు అవకాశం కలుగుతుందన్నారు. అలాగే సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర సంస్థలకు వివిధ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, రైతు డిస్కమ్ సీఎండీ జితేష్ వి.పాటిల్, సింగరేణి డైరెక్టర్ గౌతం పొట్రు తదితరులు పాల్గొన్నారు.

# ‘పుర పోరు’ నవంబరు ఒకటిన

**ఉన్నతాధికారులు, న్యాయనిపుణులతోరెండ్రోజులుగా ఎన్నికల సంఘం చర్చలు**

**కలెక్టర్లు, ఎస్పీల నివేదికలు పునఃపరిశీలనఅనంతరంపై కీలక నిర్ణయాల వెల్లడి**

**అమరావతి, అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);**



రాష్ట్రంలోని 13 నగరపాలక సంస్థలు, 87 మున్సిపాలిటీలు/నగర పంచాయతీల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సవరించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28వ తేదీన జరగాల్సిన పోలింగ్‌ను నవంబరు ఒకటో తేదీకి వాయిదా వేసింది. మూడో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఫలితాలు ప్రకటించనుంది. అలాగే మైదుకూరు మున్సిపాలిటీలో తాజాగా మొత్తం వార్డులకు నామినేషన్లు స్వీకరించాలని నిర్ణయించింది.

కడప కార్పొరేషన్‌లో 11 వార్డులు, తిరుపతి కార్పొరేషన్‌లో 18 వార్డులు, రాజంపేట మున్సిపాలిటీలో 11 వార్డులకు మాత్రం నామినేషన్లు స్వీకరించాలని ఆదేశించింది. ఈ నాలుగు చోట్లా శుక్ర, శనివారాల్లో అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకుంటారు. 25న ఉదయం వాటిని పరిశీలిస్తారు. వాటిని ఉపసంహరించుకునేందుకు ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు గడువిచ్చారు. 3 గంటల తర్వాత మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు.

ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా గురువారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. కడప, తిరుపతి, రాజంపేట, మైదుకూరుల్లో తప్ప మరెక్కడా కొత్తగా నామినేషన్లు స్వీకరించాల్సిన అవసరం లేదని ఎస్ఈసీ అభిప్రాయపడింది. 19 మున్సిపాలిటీల్లో తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వలేదంటూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. ఆయా చోట్ల ఏవైనా ఫిర్యాదులు అంది ఉంటే వాటిని మరోసారి పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఎస్ఈసీని ఆదేశించడం.. అన్ని పట్టణ సంస్థల్లో అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను 25వ తేదీ వరకు ఆపాలని నిర్దేశించడం, దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం అప్పటివరకు తుది జాబితా ప్రకటనను తాత్కాలికంగా ఆపేయడం తెలిసిందే.సుప్రీంకోర్టు తీర్పుపై ఎస్ఈసీ బుధ, గురువారాల్లో ఉన్నతాధికారులు, న్యాయనిపుణులతో సుదీర్ఘంగా కసరత్తు చేసింది. సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల నుంచి మళ్లీ నివేదికలు తెప్పించుకుని పునఃపరిశీలించింది. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ కమిషనర్, ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు.. న్యాయవాదులతో విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం మైదుకూరు, కడప, రాజంపేట, తిరుపతి మినహా మరెక్కడా నామినేషన్ల ప్రక్రియకు భంగం వాటిల్లలేదని ఎస్ఈసీ నిర్ధారించింది. అక్కడక్కడా గొడవలు జరిగినా నామినేషన్ల ప్రక్రియపై వాటి ప్రభావం ఏ మాత్రం లేదని కలెక్టర్లు, ఎస్పీల నివేదికల ఆధారంగా తేల్చింది.

దరిమిలా.. మైదుకూరులో మొత్తం 32 వార్డులకు.. కడప, రాజంపేట, తిరుపతిల్లో కొన్నేసి వార్డులకు మరోసారి నామినేషన్లు స్వీకరించాలని నిశ్చయించింది. నవంబరు 1వ తేదీన మొత్తం 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలకు పోలింగ్ జరుగుతుంది. రీపోలింగ్ అవసరమైతే మర్నాడు నిర్వహిస్తారు. 3న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. ఈ వివరాలను సుప్రీంకోర్టుకు 27వ తేదీన నివేదించనుంది.

**మళ్లీ నామినేషన్లు స్వీకరించే వార్డులివే..**

మైదుకూరు మున్సిపాలిటీ: మొత్తం 32 వార్డులు

కడప కార్పొరేషన్: 11 వార్డులు (6, 11, 13, 15, 16, 17, 24, 31, 34, 52, 55)

రాజంపేట మున్సిపాలిటీ: 11 వార్డులు (6, 12, 13, 14, 17, 19, 23, 24, 25, 26, 27)

తిరుపతి కార్పొరేషన్: 18 వార్డులు (1, 2, 3, 4, 5, 6, 9, 11, 12, 13, 14, 19, 55, 56, 57, 59, 65, 66)

# ఎంత వరకైనా పోరాడదాం: జగన్

**వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ**

**స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ**

**చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపణ**

అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);



వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

“చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు“ అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు.క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యం ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. “క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాల సేకరణ చాలా అవసరం. పటిష్ఠ ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయపోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం“ అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# తెలంగాణలో కరువు మండలాలుగా ప్రకటించాలి...

**పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి..**

**ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మట్టపల్లి అంజయ్య డిమాండ్**

**అనంతగిరి అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);**

తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే కరువు మండలాలను ప్రకటించి, రైతులకు కరువు సహాయక చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది.పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ.25 వేల పరిహారం అందించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి మట్టపల్లి అంజయ్య కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం, బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడకపోవడం వంటి కారణాలతో ఈ ఏడాది తెలంగాణలో సాధారణ వర్షపాతం కంటే సుమారు 23 శాతం తక్కువ వర్షాలు నమోదయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాల పరిధిలోని 12,760 గ్రామాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, 11,479 గ్రామాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదై పంటలు ఎండిపోయాయని తెలిపారు. దాదాపు 12 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.బోర్లు, బావులు ఎండిపోవడంతో తాగునీరు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు, వ్యవసాయ




కూలీలు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరు అందించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే అప్పులు, పెట్టుబడి భారాలతో సతమతమవుతున్న రైతులకు పంట దిగుబడులు తగ్గిపోవడం మరింత నష్టాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇప్పటివరకు తగిన కరువు సహాయక చర్యలు చేపట్టకపోవడం ఆందోళనకరమన్నారు.

**సంఘం ప్రధాన డిమాండ్లు ఇవే..**

రాష్ట్రంలోని కరువు ప్రభావిత 18 జిల్లాల్లో కరువు మండలాలను ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించాలని అంజయ్య డిమాండ్ చేశారు.పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు.పశువులకు పశుగ్రాసం, ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.విద్యుత్ కోతలను నిలిపివేసి వ్యవసాయానికి రోజుకు తొమ్మిది గంటల నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని, రైతులపై అదనపు విద్యుత్ భారం మోపవద్దని సూచించారు. పంట నష్టపోయిన రైతుల రుణాలను వడ్డీ రహితంగా పునఃషెడ్యూల్ చేసి, రుణాల వసూళ్లను తాత్కాలికంగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి. లేకపోతే ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మట్టపల్లి అంజయ్య హెచ్చరించారు.

# ఫిబ్రవరి 24 నుంచి ఏపీలో ఇంటర్ పరీక్షలు..

**ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు థియరీ పరీక్షల నిర్వహణ**

**ఫిబ్రవరి 24 నుంచి ఫస్టియర్, ఫిబ్రవరి 25 నుంచి సెకండియర్ పరీక్షలు**

**ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు**

**ఇది తాత్కాలిక షెడ్యూల్ మాత్రమేనని బోర్డు వెల్లడి**

**పండుగలు, సెలవులను బట్టి తుది షెడ్యూల్‌లో మార్పులకు అవకాశం**

**అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);**

ఆంధ్రప్రదేశ్‌లో 2027 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు ప్రకటించింది. థియరీ పరీక్షలు 2027 ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16



వరకు జరగనున్నాయి.వివరాల్లోకి వెళితే, ఇంటర్ ఫస్టియర్ (జూనియర్ ఇంటర్) పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి జరగనుండగా, సెకండియర్ (సీనియర్ ఇంటర్) పరీక్షలు మరుసటి రోజు, అనగా ఫిబ్రవరి 25న మొదలవుతాయి. ప్రతీరోజూ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.థియరీ పరీక్షలకు ముందే ప్రాక్టికల్స్ పూర్తి కానున్నాయి. జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుపుతారు. ఇక ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ పరీక్షలను ఆదివారాలతో సహా ప్రతీరోజూ రెండు సెషన్లలో (ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు) నిర్వహిస్తామని బోర్డు స్పష్టం చేసింది.అయితే, ప్రస్తుతం విడుదల చేసిన ఈ షెడ్యూల్ తాత్కాలికమైనదని (ప్రొవిజనల్) అధికారులు తెలిపారు. ప్రభుత్వ సెలవులు, పండుగల తేదీలను పరిగణనలోకి తీసుకుని తుది షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉందని వారు సూచించారు. విద్యార్థులు ఈ తాత్కాలిక షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ప్రొటోకాల్ లేకుండా నేరుగా చంద్రబాబు నివాసానికి పవన్..

## పరిషత్ పోరుపై కీలక మంతనాలు!

**అక్టోబర్ 22(జర్నలిస్ట్ వార్త);**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఊహించని, ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎలాంటి అధికారిక హంగు ఆర్భాటాలు లేకుండా అత్యంత సాధారణ వ్యక్తిలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకున్నారు. సైరన్ మోగించే కాన్వాయ్ గానీ, భద్రతా సిబ్బంది గానీ లేకుండా ఆయన నేరుగా సీఎం ఇంటికి వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే ఈ భేటీ జరగడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేయలేకపోయిన వారికి మరో 48 గంటల సమయం ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) సుప్రీంకోర్టు సూచించడమే ఈ ఆకస్మిక సమావేశానికి ప్రధాన కారణం. ఈ ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రంలో 19 మున్సిపాలిటీలతో పాటు జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ



ఎన్నికల ప్రక్రియపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై చంద్రబాబు, పవన్ లోతుగా చర్చించారు. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేస్తూనే, ఈ పరిణామాన్ని అవకాశంగా తీసుకుని వైసీపీ చేసే రాజకీయ ప్రచారాన్ని ఎలా తిప్పికొట్టాలనే దానిపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది.

ఈ భేటీలో ముఖ్యంగా పరిషత్ ఎన్నికలే ప్రధాన అజెండాగా నిలిచాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి అభ్యర్థుల మధ్య సీట్ల సర్దుబాటు, నామినేషన్ల ప్రక్రియలో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు ఒక అవగాహనకు వచ్చారు. గతంలో మున్సిపల్ ఎన్నికల సమయంలో వైసీపీ సృష్టించిన నాటకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పక్కా ప్రణాళికతో నామినేషన్ల ఘట్టాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి, గ్రామ స్థాయిలో కూటమి ఓటు బ్యాంకును పటిష్ఠం చేసుకుంటూ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఉమ్మడి కార్యాచరణను ఖరారు చేశారు.

డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ కేవలం పార్టీ పనుల కోసమే ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి వచ్చారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. క్లిష్టమైన రాజకీయ పరిస్థితుల్లో అధికారిక హంగుల కన్నా, పక్కా వ్యూహంతో ముందుకు సాగడమే ముఖ్యమనే బలమైన సందేశాన్ని ఈ చర్య ద్వారా పవన్ తన శ్రేణులకు పంపించారు. ఈ భేటీ ద్వారా పరిషత్ ఎన్నికల్లో వైసీపీ ఎత్తుగడలను సమర్థంగా ఎదుర్కొనేందుకు కూటమి సిద్ధంగా ఉందని చంద్రబాబు, పవన్ స్పష్టం చేశారు.

# ఉరిశిక్షలు ప్రజాస్వామికమేనా?



ఆనాడు మహేంద్ర కర్మపై, మావోయిస్టు పార్టీ దాడి చేసి చంపింది అనే కారణంతో.. ఈనాడు మావోయిస్టు పార్టీకి చెందిన ఆదివాసి బిడ్డలకు ఉరిశిక్ష ఖరారు చేసింది ఎన్ఐఎ కోర్టు! 2013 మే 25న చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా దర్భా లోయ, ఝీరాం ఘాటీ ప్రాంతం వద్ద జరిగిన దాడి కేసులో.. కాంగ్రెస్ పార్టీ పరివర్తన యాత్ర కాన్వాయిపై, మావోయిస్టు పార్టీ గిరిజనులతో కలిసి దాడి చేసింది. ఆ దాడిలో చత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహేంద్ర కర్మతో పాటు మొత్తం 27 మంది వరకు మరణించారు! ఆనాటి ఈ దాడి ఘటనకు సంబంధించి, గత నెల 16 సెప్టెంబరు 2026 న ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు, పది మంది మావోయిస్టులకు ఉరిశిక్ష విధించింది! ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం, ఈ పరిణామం దేనికి సంకేతం? కగార్ ఆపరేషన్ కంటే ముందు నుండే ఆయుధాలు వీడి ప్రజాస్వామిక పద్ధతుల్లో పనిచేయండి అనీ ప్రభుత్వం మావోయిస్టులకు పిలుపునిచ్చింది!ప్రభుత్వం వేలాదిమంది సైనిక బలగాలను రప్పించి, మావోయిస్టు పార్టీని ఉక్కుపాదంతో అణచివేసింది! శవాల గుట్టలు, రక్తపాతాలు నిత్యకృత్యం అయ్యాయి! వందలాది మంది మావోయిస్టులు అధునాతన ఆయుధాలతో వచ్చి, ప్రభుత్వం ముందు లొంగిపోయారు! ఇప్పుడున్నది మావోయిస్టు రహిత భారతదేశం అని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది! ఈ విధంగా ఇప్పుడు మావోయిస్టు పార్టీ పూర్తిగా లేకుండాపోయింది అని ప్రభుత్వమే ప్రకటించిన నేపథ్యంలో.. ప్రస్తుతం మావోయిస్టులపై మోపబడిన నేరాలు, శిక్షలు వంటి కీలక విషయాల్లో, ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించాల్సి ఉంటుంది అంటే, నూటికి నూరు శాతం ప్రజాస్వామికంగానే, మానవీయంగానే వ్యవహరించాల్సి ఉంటుంది!మావోయిస్టుల నేరాలపై అమలు చేయాలనుకున్న శిక్షల విషయంలో.. ఆ శిక్షల తీవ్రతను తగ్గించే ఒక ప్రజాస్వామిక వాతావరణాన్ని ప్రభుత్వం నెలకొల్పాలి! గతంలోవలె అణచివేత విధానాలను పాటించకూడదు! కానీ ఇప్పుడు జరుగుతున్నది ఏమిటి? ఆనాడు ఆ నేరాలకు పాల్పడ్డారు అనే కారణంతో.. మావోయిస్టు పార్టీలో పని చేసిన అడవి బిడ్డలకు, ఈరోజు ఉరిశిక్షలు ఖరారు చేశారు! ఈ నిర్ణయం న్యాయమేనా? మానవీయమేనా? ప్రభుత్వం ఆలోచించాలి? ఇంతకూ ఈ దేశంలో ఎవరికి ఉరిశిక్షలు పడాలి? నేరస్థులకా? నేర సంస్కృతికా? రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, ఆ నేరమయ సంస్కృతిని వ్యవస్థీకృతం చేసి.. సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలకు కారణమైన పాలక ప్రభుత్వాలకా? ఎవరికి పడాలి ఈ శిక్షలు? ఆనాడు 'పార్లమెంటరీ వ్యవస్థను కూల్చేస్తాం' అనే నినాదంతో బయలుదేరిన వారు చట్ట ప్రకారం నేడు నేరస్థులైతే..రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన చేస్తున్న వాళ్లు, ప్రజల రక్షణ కోసం ఏర్పడిన చట్టాలను అమలు చేయని వాళ్ళు, ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టించిన వాళ్ళు, అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా భూములు ఆస్తులు కొల్లగొట్టిన వాళ్లు.. ఒక్కమాటలో చెప్పాలంటే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న వాళ్లు, నేరస్థులు కారా? తప్పులు చేసిన వాళ్ళు తమ తప్పులు తెలుసుకుని, సరిదిద్దుకునే విధంగా.. సంస్కరణ వాద స్పృహతో శిక్షల విధానం ఉండాలే తప్పా.. తప్పులు చేసిన వాళ్లకు ఇక జీవితమే ఉండకూడదు, శిక్ష పేరుతో వాళ్ళని చంపేయాలి.. అని ప్రభుత్వమే భావిస్తే, అది ప్రజాస్వామిక ప్రభుత్వం అవుతుందా? వ్యక్తి ఆలోచన కంటే ప్రభుత్వం ఆలోచన.. గొప్పగా మానవీయంగా ఉండాలి కదా!ఒక వ్యక్తి హత్య చేసి నేరస్థుడు అయినప్పుడు, ప్రభుత్వం కూడా శిక్ష పేరుతో వ్యక్తిని హత్య చేస్తే, అది నేరం కాకుండా పోతుందా? అందుకే నేరాలు, శిక్షలు వంటి విషయంలో, ప్రభుత్వ పాలన ప్రజలను సంస్కరించే విధంగా ఉండాలి తప్పా.. ప్రభుత్వమే హంతకుడుగా మారి, ప్రజలను హత్య చేసే విధంగా, పాలన విధానాలు ఉండకూడదు! రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కును కాలరాయకూడదు! సాయుధ పోరాటం వల్ల తరతరాలుగా ఉద్యమ ప్రజలు సర్వము కోల్పోయారు! ఇక భవిష్యత్తులో కూడా, అది ఈ దేశంలో సఫలం కాదని చరిత్ర చెబుతుంది! కాబట్టి మావోయిస్టు పార్టీ నాయకులు, చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక పార్టీని నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది! అదే సమయంలో మావోయిస్టు పార్టీ పేరును, దాని అనుబంధ సంఘాల పేర్లను అన్నిటిని తొలగించాలి! మళ్లీ కొత్తగా ప్రతిదీ ప్రజాస్వామిక పద్ధతిలో నిర్మాణం కావాలి! ఉద్యమాల్లో మార్క్సిస్టు సిద్ధాంతమే గైడ్‌లైన్‌గా ఉండాలి తప్పా, మరొక పేరుతో కాదు!అందుకే ఇలాంటి చర్చనీయాంశాలను చర్చించాలంటే, దేవ్ జీ బృందం చేయాల్సిన పని.. మాజీ మావోయిస్టులందరినీ సమావేశపరచడానికి బహిరంగ పిలుపు ఇవ్వాలి! రెండు మూడు రోజుల పాటు కొనసాగేలా ఈ సమావేశం ఉండాలి. ఎంతో మహోజ్వలంగా సాగిన విప్లవోద్యమం, పూర్తిగా అంతరించిపోవడానికి.. పార్టీ వైపు నుంచి, నాయకత్వం వైపు నుంచి, ఉద్యమ శ్రేణుల వైపు నుంచి జరిగిన తప్పిదాలను వైఫల్యాలను సమీక్షించుకునే విధంగా సమావేశం జరగాలి! ప్రస్తుత పరిస్థితుల్లో పూర్తిగా రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయడానికి, ఎలాంటి విధానాలు ఏర్పరుచుకోవాలి అన్న అంశాలపై, ప్రతి వ్యక్తి ఐదు నుంచి పది నిమిషాల పాటు తన అనుభవాలను చెప్పే విధంగా సమావేశం ఉండాలి! ఆ విధంగా అందరి సమష్టి ఆలోచనలను పరిగణలోకి తీసుకొని, రాజ్యాంగ విధానాలకు లోబడే ఒక ప్రజాస్వామిక పార్టీని ఏర్పాటు చేయాలి!అప్పు డే అది ప్రజల్లో విస్తృతంగా పనిచేసి, ప్రజల ఆమోదం పొందగలుగుతుంది. ఉద్యమ లక్ష్యాన్ని సాధించగలుగుతుంది!

# పవన్ రాజీనామా అంటూ ఫేక్ న్యూస్

### : సైబర్ చర్యల హెచ్చరికతో క్షమాపణ చెప్పిన వాట్సాప్ గ్రూప్ అడ్మిన్



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పదవికి రాజీనామా చేస్తున్నారంటూ వాట్సాప్‌లో తప్పుడు సమాచారాన్ని సర్క్యులేట్ చేసిన ఓ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ క్షమాపణలు చెప్పారు. ఈ ఫేక్ న్యూస్‌ను తీవ్రంగా పరిగణించిన ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించడంతో, సదరు అడ్మిన్ వెనక్కి తగ్గారు.
సోషల్ మీడియాలో వచ్చిన ఒక పోస్ట్ చూసి, నిజానిజాలు నిర్ధారించుకోకుండా "పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా" అని గ్రూప్‌లో షేర్ చేసినట్లు అడ్మిన్ తన వివరణలో తెలిపారు. ఇది ఎలాంటి దురుద్దేశంతో జరగలేదని, పొరపాటున జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పవన్ కల్యాణ్‌కు, జనసేన నాయకులకు, కార్యకర్తలకు, గ్రూప్ సభ్యులకు మనస్ఫూర్తిగా క్షమాపణ చెబుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పూర్తి వివరాలు తెలుసుకున్నాకే పోస్టులు షేర్ చేస్తానని హామీ ఇచ్చారు.అంతకుముందు, పవన్ రాజీనామా చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై డిప్యూటీ సీఎం కార్యాలయం తీవ్రంగా స్పందించింది. "డిప్యూటీ సీఎంఓ, ఆంధ్రప్రదేశ్" పేరుతో నడుస్తున్న ఫేక్ వాట్సాప్ ఛానెల్‌పై, ఇతర తప్పుడు ప్రచారాలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ కార్యాలయం పేరును దుర్వినియోగం చేస్తూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ అధికారిక హెచ్చరికల నేపథ్యంలోనే వాట్సాప్ అడ్మిన్ క్షమాపణ చెప్పినట్లు స్పష్టమవుతోంది

# నిద్ర వీడి.. నిప్పు కణాలైతేనే!



దసరాతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. పాతిక యేళ్ల కిందటితో పోలిస్తే మన పండుగల తీరెతెన్నులే మారిపోయాయి. ముఖ్యంగా యువత పరంగా! పండుగలు,- ఉత్సవాలు అంటే మద్యంలో మునిగి తేలడం. దసరా సరదా తీర్చుకోవడంలో ఎన్ని బీరు బాటిళ్ల ఖాళీ అయ్యాయి. ఎన్ని విస్కీ కార్టున్లు అమ్ముడయ్యాయి, ఎంత మద్యం తాగారు? రేపో మాపో లెక్కలు పత్రికల పతాక శీర్షిక లెక్కుతాయి. అందులో విశేషమేం లేదు. విషయమేమిటంటే, గ్రామాల్లో ఇదొక జాడ్యంలా తయారైంది. యువతను పూర్తిగా నిర్వీర్యం చేస్తోంది. ఎవరూ చెప్పేవారు లేరు, అధవా చెప్పినా వినేవారు అసలే లేరు. కల్లు, సారా చీప్ లిక్కర్, దేశీ మద్యం, విదేశీ బ్రాండ్లు ఇలా... ఆర్థిక స్తోమత- స్థాయిని బట్టి ఏదో ఒకటి తాగుతున్నారు. వివిధ రూపాల్లో గంజాయి కూడా విస్తరిస్తోంది. సరదాగా మొదలైన అలవాట్లకు క్రమంగా కట్టుబానిసలవుతున్నారు. వాళ్లు-వీళ్లని తేడా లేదు మిగతా విషయాల్లో ఎట్లున్నా తాగుడుకు వచ్చేసరికి ఉద్యోగులు, నిరుద్యోగులు అని తేడా లేదు. వాళ్లు, వీళ్లు కలిసో, విడివిడిగానో తాగుతూనే ఉన్నారు. రోజువారీ తాగుడు ఒకటైతే పండుగలు, పబ్బాలు, ఉత్సవాలు ఒక బలమైన సాకు (బహానా) వారికి. బోనాల పండుగతో మొదలయితే వినాయకోత్సవాలు, వెంటనే నవరాత్రులు, తర్వాత దీపావళి ఇటు అటు అంటే కొత్త సంవత్సరం, అతి దగ్గరలోనే మూడొద్దల సంక్రాంతి వేడుకల్లో మునిగి తేలడమే! ఉద్యోగులా, వ్యాపారులా, నిరుద్యోగులా అనే తేడాలు లేకుండా మద్యానికి బానిసలవుతున్నారు. జీవితంలో పైకెదగాలనో, జీవన ప్రమాణాలు పెంచుకోవాలనో తపన, పట్టుదల, జిజ్ఞాస వారిలో క్రమంగా సన్నగిల్లుతున్నాయి. సర్కారు వారి పలు స్కీములు కింద లభించే నగదు, చౌక బియ్యం వంటివి అందుబాటులో ఉండటం వల్ల దిగువ మధ్య తరగతి, పేద, నిరుపేద కుటుంబాల కనీస జరుగు బాటుకు ఢోకా లేకపోవడం యువత ఉదాసీన, నిర్లక్ష్య వైఖరికి కారణం కావచ్చని సామాజిక వేత్తలంటారు.ఇరుగు పొరుగు ఏ రాష్ట్రంతో పోల్చినా తెలంగాణలో నిరుద్యోగిత తక్కువేం లేదు. 15 ఏళ్లు పైబడిన వారిలో నిరుద్యోగిత రేటు భారత సగటు 5.4% కాగా తెలంగాణలో అది 5.7%గా నమోదయింది. కూలీల భాగస్వామ్యం రేటు (ఎల్ఎఫ్‌పిఆర్) కూడా తెలంగాణలో ఎక్కువే. తాజా (పిఎల్ఎఫ్ఎస్) సర్వే ప్రకారం దేశ సగటు 54.6% ఉంటే, తెలంగాణలో 58.2% గా తేలింది. అంటే 15 ఏళ్ల పైబడ్డ ప్రతి 10 మందిలో 6 మంది తగిన పని/ ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్నారని లెక్క. తెలంగాణ యువతలో (15 29 యేళ్లు) నిరుద్యోగం రేటు 19.3% అన్నది జాతీయ సగటు కన్నా మూడు రెట్లు అధికం. అందుకే, టెన్త్- ఇంటర్ డ్రాపౌట్స్, డిగ్రీ, డిస్కంటిన్యూలు, ఇంజనీరింగ్‌లోనో, ఏదో సాధారణ డిగ్రీలోనో పట్టా పొందినా ఉద్యోగం లేని, ఉపాధి దొరకని వారు లక్షలమంది ఉన్నారు. సరదాతోనో, అసహనంతోనో మొదలయ్యే తాగుడు అలవాటు వ్యసనంగా మారాక వారా విష వలయం నుండి బయట పడలేకపోతున్నారు. కష్టపడి అదనపు కోర్సులతోనో, నైపుణ్యాల వృద్ధితోనో మంచి ఉద్యోగం పట్టుకోవాలన్న తృష్ణ, పట్టుదల వారిలో చచ్చిపోతోంది. నిన్న కన్నా ఇవాళ, ఇవాల్టి కన్నా రేపు వారు మరింత బలహీనులవుతున్నారు. రాజీపడి, ఏ ఎదుగుదలా లేని అధ్వానపు బతుకులీడుస్తున్నారు.వెలిగే మరో పార్శ్వం ఐటి, ఎఐ వంటి సాంకేతికతను బాగా అందిపుచ్చుకున్న యువతరం మరోవైపు అంచనాలకు మించి ఎదుగుతోంది. విషయంతోపాటు భాష, భావప్రసరణ (కమ్యునికేషన్)లో నైపుణ్యాలు సాధించి ప్రపంచ మూల మూలకూ విస్తరిస్తున్నారు. ఆర్థిక సరళీకరణ, మారిన మార్కెట్ పరిస్థితుల్లో దేశంలోనూ వారికి అవకాశాలు పెరుగుతున్నాయి. అయితే వీరి శాతం చాలా తక్కువ. అటువంటి యువత తెలుగు వాళ్లలోనూ ఉంది. 'కెరీరిజం' తప్ప మరో ధ్యాస ఉండదు, వారిలో సామాజిక స్పృహ జీరో అన్న ఇదివరకటి పరిస్థితి మారింది. వారి దృక్పథంలో, ఆత్మవిశ్వాసంలో, ఆలోచానా సరళిలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. 'నీట్' పేపర్ లీక్ దరిమిలా సాగిన విద్యార్థి, యువ ఉద్యమం పలు ప్రతిఘటనల మధ్య కూడా ఫలితం సాధించింది.ఎన్నికల ప్రక్రియను సంస్కరించాలి, సిఇసి దిగిపోవాలనే డిమాండ్ తో ఇప్పుడు సాగుతున్న ప్రజాందోళనలో యువత క్రియాశీలకంగా ఉంది. ఇవన్నీ గమనిస్తున్న వారు గుర్తిస్తున్నదొక్కటే, యువత ఆలోచన సరళి మారింది. 'కెరీరిజం' గంతలతో సాగే జట్కా గుర్రంలా కాకుండా సమాజాన్ని, సమస్యల మూలాల్ని వారు గ్రహిస్తున్నారు. తగు బాధ్యతతో స్పందిస్తున్నారు. సహనం, పట్టుదల, సమర్థ అభివ్యక్తితో వ్యవహరిస్తున్నారు అని రుజువైంది. 'కాక్రోచ్' అనే మాట వాడి సిజెపి పుట్టుకకు కారణమైన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ గొంతు సవరించుకొని యువతకు కితాబిచ్చారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో, 'బెంగళూరు'లో పలు సందర్భాల్లో మాట్లాడుతూ 'భారత యువత నడతను చూసి గర్విస్తున్నాన'న్నారు.
ఉద్ధవ్ థాకరే (శివసేన) ముంబై శివాజీ పార్కులో జరిగిన దసరా ర్యాలీలో మాట్లాడుతూ 'అవగాహనతో వీధుల్లోకి వచ్చి పోరాడుతున్న యువత విప్లవ యోధుల'న్నారు. 'దేశ యువతలో పెరిగిన ఆత్మవిశ్వాసం, ప్రయోగశీలత, మూస పద్ధతికి భిన్నంగా ఆలోచించే ధోరణి దేశంలో వస్తున్న పెను మార్పుకు సంకేతమ'ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సెలవిచ్చారు. ఆర్ఎస్ఎస్ అధినేత (సర్ సంఘ్ చాలక్) మోహన్ భాగవత్ అయితే యువతను ఏకంగా ఆకాశనికెత్తారు. కిందటి తరం యువతకన్నా, ఇప్పుడున్న భారత్ యువతరం అధిక నిజాయతీ పరులని, ప్రశ్నించడం అలవడి, హేతుబద్ధంగా ఆలోచిస్తున్నారని ప్రశంసించారు. సాంకేతికత వాడుకుంటూ, తెలివితేటలు, -నైపుణ్యాలు పెంచుకుంటూ ఒకవైపు యువత తమ పరిస్థితి మెరుగుపరుచుకుంటూనే మరోవైపు సమాజం గురించి ఎంతో బాధ్యతగా ఆలోచిస్తోంది. కార్యాచరణ అమలు చేస్తోంది. మరోవైపు మెజారిటీ యువత నిరుద్యోగం, ఉపాధి లేమితో కొట్టుమిట్టాడుతూ మద్యం, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసవుతోంది. తెలుగు తేజం వెలగాలి భాషలునేర్చుకోండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో యువత అప్రమత్తం కావాలి. ఆత్మపరిశీలన జరగాలి. దేశ యువతరమంతా పురోగామిగా సాగుతున్నప్పుడు వెనుకబాటు తగునా? అని తెలుగు యువతరం ఆలోచించాలి. తాత్కాలికమైన తృప్తినిచ్చి, మత్తులో జీవితాల్నే చిత్తుచేసే మద్యం మహమ్మారి మాయా వల(యం) నుంచి బయటపడాలి. చిత్తశుద్ధితో ఎవరికి వారు ఆలోచించి, 'నడత' మార్చుకొని సమాజానికి బలమైన వనరుగా మారాల్సిన సమయం. 'ఓటర్ పెన్షన్ల మంజూరీకి పేర్ల నమోదు కోసం వెళితే గ్రామాల్లో ఎక్కువ మంది యువతులు, నడి వయస్కులు పేర్లు రాపించుకుంటున్నారు. మ్యాప్‌లుచూడండి ఏమిటని ఆరాతీస్తే, వారి భర్తలు చిన్న వయసులో తాగుడుకు బానిసలై చనిపోయినట్టు తెలుస్తోంది' అన్న తెలంగాణ (మెదక్ జిల్లా) ఎంపిడిఒ ఒకరి మాటలు ఎవరి గుండెనైనా కలతపెట్టేవే! కంటతడి పెట్టించేవే!! ఎందరో జాతి వైతాళికులు ప్రేరణనిచ్చిన గడ్డ మన తెలుగు నేల.
ఐడి కార్డు లేదని జవహర్ లాల్ నెహ్రూనే లోనికి అనుమతించని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, విశ్వస్థాయిలో మేధస్సు -తరగని గుండె ధైర్యం కలగలిసిన జార్జిరెడ్డి, రాజు ఎంత బలవంతుడయినా తాను ప్రజాపక్షం వహిస్తానని 'నిజం' కోసం గొంతువిప్పి ప్రాణాలర్పించిన షోయబుల్లాఖాన్ వంటి వారు నడయాడిన నేల ఇది. ఈ నేలలో మొగ్గతొడిగిన యువ కిశోరాలు లక్ష్యం లేకుండా రాజీపడొద్దు. మద్యం మత్తు లో జోగొద్దు. జాగృతం కావాలి. తమను తాము మెరుగుపరుచుకుంటూ సమాజానికి సమర్థ వనరు కావాలి.

# ఫ్రాన్స్ ఎందుకు తగలబడుతోంది?

### ఆందోళనల వెనుక కమ్యూనిస్టుల కుట్ర ఉందా? ఆర్థిక సంక్షోభమే అసలు కారణమా!

### పొదుపు చర్యల పేరుతో సంక్షేమంపై కోతలు.. వీధుల్లోకి విద్యార్థులు, కార్మికులు

### ఐరోపాను కమ్ముకుంటున్న ఆర్థిక మాంద్యం భయాలు.. ప్రజా అసంతృప్తిని రాజకీయంగా మలుచుకుంటున్న మితవాద శక్తులు



ఫ్రాన్సులో విద్యార్థులు, కార్మికుల ఆందోళనలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, పొదుపు చర్యలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాలపై నిరసనలు వ్యక్తమవుతుండగా, వాటి వెనుక కమ్యూనిస్టులు, సోషలిస్టుల కుట్ర ఉందంటూ మరోవైపు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆందోళనలను కేవలం రాజకీయ కుట్రగా చూడాలా? లేక ప్రజల ఆర్థిక ఇబ్బందులు, తగ్గుతున్న కొనుగోలు శక్తి, పెరుగుతున్న జీవన వ్యయం వంటి మౌలిక సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలా? అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది.ఒకవైపు అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సమావేశాల్లో ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించడం, ఆర్థిక క్రమశిక్షణను పాటించడం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ప్రభుత్వాలు అమలు చేస్తున్న పొదుపు చర్యలు తమ జీవితాలపై ప్రభావం చూపుతున్నాయంటూ వివిధ దేశాల్లో ప్రజలు నిరసనలకు దిగుతున్నారు. ఈ రెండు పరిణామాల మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తే, ప్రస్తుత ఆందోళనలకు కేవలం రాజకీయ కోణమే కాకుండా ఆర్థిక, సామాజిక నేపథ్యం కూడా ఉందని స్పష్టమవుతుంది. **ఆందోళనలకు కమ్యూనిస్టులే కారణమా?** ఫ్రాన్సులో జరుగుతున్న విద్యార్థి ఉద్యమం వెనుక కమ్యూనిస్టులు, సోషలిస్టుల హస్తం ఉందంటూ కొన్ని రాజకీయ శక్తులు ఆరోపిస్తున్నాయి. అమెరికాకు చెందిన ఫాక్స్ న్యూస్ కూడా ఉద్యమంలో పాల్గొన్న వివిధ సంస్థల సంబంధాలను ప్రస్తావిస్తూ కథనాలను ప్రసారం చేసినట్లు నవతెలంగాణ సంపాదకీయంలో పేర్కొన్నారు. విద్యార్థి, యువజన, కార్మిక సంఘాలు, వామపక్ష రాజకీయ సంస్థలు ఉద్యమానికి మద్దతు ఇవ్వడాన్ని ఈ ప్రచారంలో ప్రధానంగా చూపించారు.అయితే ఏదైనా ఉద్యమానికి రాజకీయ పార్టీలు లేదా సామాజిక సంస్థలు మద్దతు ఇవ్వడం ఒక్కటే దాని వెనుక కుట్ర ఉందని నిరూపించదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వివిధ సంఘాలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, ప్రజల సమస్యలపై నిరసనలకు మద్దతు ఇవ్వడం సహజమైన పరిణామం. అదే సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటే వాటిపై స్వతంత్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. కానీ నిరసనల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఒకే రాజకీయ ముద్రతో చూడడం వల్ల అసలు సమస్యలు మరుగునపడే ప్రమాదం ఉంది. **పొదుపు చర్యల ప్రభావం ప్రజలపై ఎంత?** ప్రభుత్వాలు తమ బడ్జెట్ లోటును తగ్గించుకోవడానికి, అప్పులను నియంత్రించడానికి ఖర్చులను తగ్గించే చర్యలు చేపడుతుంటాయి. అయితే ఈ చర్యల్లో భాగంగా విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక భద్రత వంటి రంగాలపై వ్యయం తగ్గితే దాని ప్రభావం నేరుగా సాధారణ ప్రజలపై పడుతుంది. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ప్రభుత్వ సేవలపై ఎక్కువగా ఆధారపడుతుంటాయి. అందువల్ల సంక్షేమ వ్యయాన్ని తగ్గించే నిర్ణయాలు వారి జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.ఫ్రాన్సులో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, తరగతి గదుల్లో విద్యార్థుల రద్దీ, ఉపాధ్యాయుల కొరత వంటి అంశాలను కూడా సంపాదకీయంలో ప్రస్తావించారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, తగిన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించడం వంటి డిమాండ్లు ప్రజా సేవల నాణ్యతకు సంబంధించినవే. ఇటువంటి సమస్యలపై విద్యార్థులు, కార్మికులు, ఇతర సామాజిక వర్గాలు ఆందోళనలకు దిగితే వాటి వెనుక ఉన్న కారణాలను పరిశీలించడం ప్రభుత్వ బాధ్యత.ప్రభుత్వ అప్పులు పెరగడం ఒక సమస్య అయితే, వాటిని తగ్గించే పేరుతో ప్రజలకు అవసరమైన సేవలను బలహీనపరచడం మరో సమస్య.

# ఉత్కంఠ పోరులో భారత్ విజయం



### ఆఖర్లో నమన్ ధీర్ విధ్వంసం..

### న్యూజిలాండ్‌పై నాలుగు వికెట్లతో గెలుపు

### 225 పరుగుల భారీ లక్ష్యం ఛేదన.. సంజు శాంసన్ మెరుపులు.. శ్రేయస్ అయ్యర్ పోరాటం

**హైదరాబాద్:** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. భారీ లక్ష్య ఛేదనలో చివరి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. చివర్లో నమన్ ధీర్ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత జట్టుకు విజయాన్ని అందించాడు. కేవలం 15 బంతుల్లోనే 42 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు.తొలుత టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. గ్లెన్ ఫిలిప్స్ అజేయంగా 81 పరుగులతో చెలరేగగా, ఫిన్ అలెన్ 45, టిమ్ సీఫెర్ట్ 24 పరుగులతో రాణించారు. భారత బౌలర్లు ప్రత్యర్థి పరుగుల వేగాన్ని అడ్డుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ శుభారంభం అందించారు. సంజు 33 బంతుల్లో 67 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అభిషేక్ శర్మ 29 పరుగులతో రాణించాడు. తొలి వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ విజయం దిశగా సాగుతున్నట్లు కనిపించింది.అయితే స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. సంజు శాంసన్ ఔటైన తర్వాత తిలక్ వర్మ, ఇషాన్ కిషన్ తక్కువ పరుగులకే వెనుదిరిగారు. ఈ దశలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 42 పరుగులతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టగా, అక్షర్ పటేల్ 24 పరుగులతో సహకరించాడు.చివరి ఓవర్లలో భారత్ విజయానికి పరుగుల వేగం పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన నమన్ ధీర్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొంటూ వేగంగా పరుగులు సాధించాడు. చివరి వరకు పోరాడిన నమన్ ధీర్ అద్భుత ప్రదర్శనతో భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. రెండు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అందుకున్న టీమిండియా అభిమానుల్లో ఆనందం నింపింది.భారీ స్కోరు చేసినప్పటికీ న్యూజిలాండ్ విజయాన్ని అందుకోలేకపోయింది. కీలక సమయాల్లో భారత బ్యాటర్లు చూపిన పట్టుదల, చివర్లో నమన్ ధీర్ దూకుడు జట్టుకు విజయాన్ని అందించాయి. ఈ ఉత్కంఠభరిత విజయంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసింది.

# ఆసియా పారా క్రీడల్లో భారత్ జోరు



### పతకాల వేటలో దూసుకెళ్తున్న భారత క్రీడాకారులు

### అథ్లెటిక్స్‌లో అదరగొట్టిన ప్రతిభావంతులు..

### పతకాల పట్టికలో ఐదో స్థానానికి భారత్

**క్రీడా విభాగం:** ఆసియా పారా క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరుస్తూ పతకాల వేటలో దూసుకెళ్తున్నారు. జపాన్‌లోని ఐచినగోయా వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో భారత పారా అథ్లెట్లు పలు విభాగాల్లో సత్తాచాటుతున్నారు. పరుగులు, ఎత్తు దూకుడు, గుండ్రాయి విసురుట, విలువిద్య తదితర క్రీడాంశాల్లో పతకాలు సాధిస్తూ దేశ ప్రతిష్ఠను పెంచుతున్నారు. ముఖ్యంగా అథ్లెటిక్స్‌లో భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు జట్టుకు కొత్త ఉత్సాహాన్ని అందిస్తున్నాయి.**ఒకే విభాగంలో మూడు పతకాలు**పురుషుల గుండ్రాయి విసురు పోటీల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో మూడు పతకాలనూ కైవసం చేసుకున్నారు. ఎఫ్46 విభాగంలో సచిన్ ఖిలారి స్వర్ణ పతకం సాధించగా, మహమ్మద్ యాసర్ రజతం, పర్వీన్ కాంస్యం గెలుచుకున్నారు. ఈ విభాగంలో భారత క్రీడాకారుల ఆధిపత్యం పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పురుషుల ఎత్తు దూకుడు పోటీల్లో ప్రవీణ్ కుమార్ మరోసారి తన సత్తా చాటాడు. 2.05 మీటర్ల ఎత్తు దూకి స్వర్ణ పతకంతో పాటు క్రీడల రికార్డును నెలకొల్పాడు. ఇదే పోటీలో బంటి 1.92 మీటర్ల ఎత్తు దూకి రజత పతకాన్ని సాధించాడు. మరోవైపు పురుషుల గుండ్రాయి విసురు ఎఫ్53 విభాగంలో ఆయుష్ వర్మ స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు.**పరుగుల పోటీల్లోనూ పతకాల పంట**పరుగుల విభాగంలోనూ భారత క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన కనబరిచారు. పురుషుల 100 మీటర్ల టీ47 విభాగంలో దిలీప్ గవిట్ మహదూ స్వర్ణ పతకాన్ని సాధించగా, మహమ్మద్ బాసిల్ రజత పతకాన్ని దక్కించుకున్నాడు. మహిళల 100 మీటర్ల టీ12 విభాగంలో సిమ్రన్ స్వర్ణం సాధించి క్రీడల రికార్డును నెలకొల్పింది. అంతకుముందు మహిళల 200 మీటర్ల టీ12 విభాగంలోనూ సిమ్రన్ స్వర్ణ పతకం గెలుచుకోవడం విశేషం.మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో దీప్తి జీవాంజి స్వర్ణ పతకాన్ని సాధించింది. 56.36 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని క్రీడల రికార్డును నెలకొల్పింది. ఈ విజయంతో అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను మరోసారి నిరూపించుకుంది. పురుషుల 100 మీటర్ల ఇతర విభాగాల్లోనూ భారత అథ్లెట్లు కాంస్య పతకాలు సాధించి జట్టు పతకాల సంఖ్యను పెంచారు.**విలువిద్యలో రజతం**విలువిద్యలో భారత క్రీడాకారిణులు షీతల్ దేవి, పాయల్ నాగ్ మహిళల పారా కాంపౌండ్ జంట విభాగంలో రజత పతకాన్ని సాధించారు. ఫైనల్లో చైనా జంట చేతిలో ఓటమి ఎదురైనా, భారత జోడీ రజత పతకంతో మెరిసింది. ఇతర విభాగాల్లోనూ భారత క్రీడాకారులు పతకాల కోసం పోరాడుతున్నారు.**పతకాల పట్టికలో భారత్ ముందంజ**అక్టోబర్ 21 నాటి పోటీల అనంతరం భారత్ మొత్తం 62 పతకాలతో పట్టికలో ఐదో స్థానానికి చేరుకుంది.

# తొలి టీ20లో న్యూజిలాండ్ భారీ స్కోరు

### ఫిలిప్స్ విధ్వంసం.. భారత బౌలర్లకు పరీక్ష

### 225 పరుగులతో ప్రత్యర్థి ముందు కఠిన లక్ష్యం

**క్రీడా విభాగం:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టీ20లో ఆతిథ్య జట్టు భారీ స్కోరు సాధించింది. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ వేదికగా జరిగిన ఈ పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. దీంతో భారత్ ముందు 226 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.టాస్ గెలిచిన భారత జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్ ఫిన్ అలెన్ వేగంగా పరుగులు సాధించి భారత బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. మరోవైపు టిమ్ సీఫెర్ట్ కూడా తనవంతు సహకారం అందించాడు. దీంతో పవర్‌ప్లేలోనే న్యూజిలాండ్ జట్టు మెరుగైన పరుగులు సాధించింది.**ఫిలిప్స్ మెరుపులు**మధ్య ఓవర్లలో గ్లెన్ ఫిలిప్స్ దూకుడుగా ఆడుతూ స్కోరు వేగాన్ని పెంచాడు. భారీ షాట్లతో భారత బౌలర్లను ఇబ్బందులకు గురిచేశాడు. అతనికి బెవన్ జాకబ్స్ అండగా నిలిచాడు. వీరిద్దరూ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో న్యూజిలాండ్ భారీ స్కోరు దిశగా సాగింది. ఫిలిప్స్ 40 బంతుల్లో అజేయంగా 82 పరుగులు సాధించి జట్టుకు బలమైన స్కోరును అందించాడు. జాకబ్స్ కూడా 31 పరుగులతో రాణించాడు.**భారత బౌలర్లకు నిరాశ**భారత బౌలర్లు ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కీలక సమయాల్లో వికెట్లు తీసినప్పటికీ పరుగుల వేగాన్ని పూర్తిగా అడ్డుకోలేకపోయారు. అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ సాధించారు. అయినప్పటికీ న్యూజిలాండ్ బ్యాటర్లు చివరి ఓవర్లలోనూ దూకుడును కొనసాగించడంతో స్కోరు 225 పరుగులకు చేరింది.భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత బ్యాటర్లపై ఇప్పుడు ఒత్తిడి నెలకొంది. ఆరంభంలోనే వేగంగా పరుగులు సాధించడంతో పాటు వికెట్లు కాపాడుకోవడం భారత్‌కు కీలకం కానుంది. న్యూజిలాండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని లక్ష్యాన్ని చేరుకుంటుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.సంక్షిప్త స్కోరు: న్యూజిలాండ్ 225/4 (20 ఓవర్లు). గ్లెన్ ఫిలిప్స్ 82 నాటౌట్, ఫిన్ అలెన్ 45, బెవన్ జాకబ్స్ 31. భారత బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ సాధించారు.



# అదిరిపోయిన భారత్.. తొలి టీ20లో ఘన విజయం!

### ఉత్కంఠ పోరులో న్యూజిలాండ్‌పై నాలుగు వికెట్లతో గెలుపు

### సంజు శాంసన్ మెరుపులు.. శ్రేయస్ అయ్యర్ పోరాటం.. నమన్ ధీర్ విధ్వంసం



**క్రైస్ట్‌చర్చ్:** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ప్రత్యర్థి నిర్దేశించిన 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చివరి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. 19.4 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 230 పరుగులు సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యాన్ని సంపాదించింది.**ఓపెనర్ల అదిరిపోయే ఆరంభం** భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 93 పరుగులు జోడించి జట్టుకు గట్టి పునాది వేశారు. అభిషేక్ శర్మ 29 పరుగులు చేసి వెనుదిరగగా, సంజు శాంసన్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. కేవలం 33 బంతుల్లో 67 పరుగులు సాధించి భారత విజయావకాశాలను మెరుగుపరిచాడు.అయితే ఓపెనర్లు ఔటైన తర్వాత భారత జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. ఒక దశలో 122 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ న్యూజిలాండ్ వైపు మొగ్గినట్లు కనిపించింది. ఈ సమయంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేసి జట్టును ఆదుకున్నాడు.**అయ్యర్ పోరాటం.. అక్షర్ సహకారం** శ్రేయస్ అయ్యర్ 28 బంతుల్లో 42 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఆటలో సంయమనం, దూకుడు రెండూ కనిపించాయి. అక్షర్ పటేల్ 24 పరుగులతో సహకరించడంతో భారత్ విజయంపై ఆశలు సజీవంగా నిలిచాయి. అయినప్పటికీ చివరి ఓవర్లలో పరుగుల అవసరం పెరగడంతో భారత శిబిరంలో ఉత్కంఠ నెలకొంది.**నమన్ ధీర్ మెరుపులు** చివరి దశలో నమన్ ధీర్ అద్భుతంగా చెలరేగాడు. కేవలం 15 బంతుల్లోనే ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 42 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కీలక సమయంలో ఒత్తిడిని అధిగమించి వేగంగా పరుగులు సాధించిన నమన్ ధీర్ భారత విజయాన్ని ఖాయం చేశాడు.**భారీ స్కోరు చేసినా ఓడిన కివీస్** అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ 40 బంతుల్లో అజేయంగా 82 పరుగులు సాధించగా, ఫిన్ అలెన్ 45, డారిల్ మిచెల్ 28, బెవన్ జాకబ్స్ 31 పరుగులతో రాణించారు. భారీ లక్ష్యాన్ని ఛేదించిన భారత్ బ్యాటింగ్ బలాన్ని మరోసారి నిరూపించింది.తొలి మ్యాచ్‌లోనే అద్భుత పోరాటంతో విజయం సాధించిన టీమిండియా సిరీస్‌లో శుభారంభం చేసింది. సంజు శాంసన్ దూకుడు, శ్రేయస్ అయ్యర్ నిలకడ, నమన్ ధీర్ మెరుపులు భారత విజయానికి ప్రధాన కారణాలయ్యాయి.సంక్షిప్త స్కోరు: న్యూజిలాండ్ 225/4 (20 ఓవర్లు). భారత్ 230/6 (19.4 ఓవర్లు). భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. సిరీస్‌లో 10 ఆధిక్యం సాధించింది.



# పారా ఆసియా క్రీడల్లో భారత్‌కు స్వర్ణ కాంతులు

### శీతల్ దేవి, తోమన్ కుమార్ జోడీకి పసిడి పతకం

### ఇండోనేషియాపై అద్భుత విజయం.. పతకాల వేటలో దూసుకెళ్తున్న భారత క్రీడాకారులు




**క్రీడా విభాగం:** ఆసియా పారా క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. విలువిద్యలో శీతల్ దేవి, తోమన్ కుమార్ జోడీ స్వర్ణ పతకాన్ని సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచింది. మిశ్రమ జట్టు విభాగంలో జరిగిన తుదిపోటీలో భారత జోడీ 151148 పాయింట్ల తేడాతో ఇండోనేషియా జంటను ఓడించింది. ఈ విజయంతో భారత పతకాల ఖాతాలో మరో స్వర్ణం చేరింది. **ఆరంభం నుంచే ఆధిపత్యం**తుదిపోటీలో భారత జోడీ ఆరంభం నుంచే ఆత్మవిశ్వాసంతో బాణాలు సంధించింది. తొలి దశలో స్వల్ప ఆధిక్యం సాధించిన భారత క్రీడాకారులు, రెండో దశలో తమ ప్రదర్శనను మరింత మెరుగుపరచుకున్నారు. దీంతో ప్రత్యర్థిపై ఆధిక్యాన్ని పెంచుకున్నారు. మూడో దశలో ఇండోనేషియా జోడీ గట్టిపోటీ ఇచ్చినప్పటికీ భారత క్రీడాకారులు ఒత్తిడికి లోనుకాలేదు. చివరి దశలో ఇరు జట్లు సమానంగా పాయింట్లు సాధించాయి. అయినప్పటికీ అంతకుముందు సాధించిన ఆధిక్యంతో భారత్ 151148 పాయింట్ల తేడాతో విజయం అందుకుంది. **సెమీఫైనల్లోనూ సత్తాచాటిన జోడీ**తుదిపోటీకి ముందు జరిగిన అర్హత పోటీలోనూ భారత జోడీ అద్భుతంగా రాణించింది. చైనీస్ తైపీ జట్టుతో జరిగిన పోటీలో 142141 పాయింట్ల స్వల్ప తేడాతో గెలిచి తుదిపోటీకి చేరుకుంది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో భారత క్రీడాకారులు సంయమనం పాటిస్తూ విజయాన్ని అందుకున్నారు.**శీతల్ దేవి అసాధారణ ప్రతిభ** శీతల్ దేవి తన శారీరక పరిమితులను అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తోంది. చేతులు లేకుండానే జన్మించిన ఆమె కాళ్లు, భుజం, దవడ సహాయంతో విల్లును సంధిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. పట్టుదల, కఠోర సాధనతో ప్రపంచ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈసారి తోమన్ కుమార్‌తో కలిసి స్వర్ణ పతకాన్ని సాధించి భారత కీర్తిని ఇనుమడింపజేసింది.**స్వాతి చౌదరికి రజత పతకం**మహిళల వ్యక్తిగత విలువిద్య పోటీల్లో భారత క్రీడాకారిణి స్వాతి చౌదరి రజత పతకాన్ని సాధించింది. తుదిపోటీలో చైనాకు చెందిన చెన్ మెంగ్‌కాన్‌తో తలపడి 46 పాయింట్ల తేడాతో ఓటమి ఎదుర్కొన్నప్పటికీ, రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ విజయంతో భారత పారా విలువిద్యలో మరో మైలురాయిని అధిగమించింది.**పతకాల పట్టికలో భారత్ ముందంజ**భారత క్రీడాకారులు అథ్లెటిక్స్, విలువిద్యతో పాటు పలు క్రీడాంశాల్లో పతకాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. స్వర్ణాలు, రజతాలు, కాంస్యాలతో పతకాల సంఖ్యను పెంచుకుంటూ పోటీల్లో తమ ఆధిపత్యాన్ని చాటుతున్నారు. ప్రతి విజయం భారత క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.శీతల్ దేవి, తోమన్ కుమార్ జోడీ సాధించిన స్వర్ణం భారత పారా క్రీడా రంగానికి మరో గర్వకారణంగా నిలిచింది. వైకల్యాలను అధిగమించి పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని వారు నిరూపించారు. రాబోయే పోటీల్లోనూ భారత క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించి దేశ ప్రతిష్ఠను పెంచుతారని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.

# పెళ్లి పీటలెక్కనున్న 'హనుమాన్' హీరో..

## తేజ సజ్జా వివాహ ముహూర్తం ఫిక్స్!



టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడు. డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తన వివాహం జరగనున్నట్లు వెల్లడించాడు. నవంబర్‌లో నిశ్చితార్థం నిర్వహించి, ఆ తర్వాతి నెలలో పెళ్లి వేడుక జరగనుంది. తనది పెద్దలు కుదిర్చిన వివాహమని, తల్లిదండ్రులే సంబంధం ఖరారు చేశారని తేజ తెలిపాడు.
తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ గోప్యంగా ఉంచే తేజ.. పెళ్లి వేడుకను కూడా నిరాడంబరంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఉదయ్‌పూర్‌లో వివాహం అనంతరం హైదరాబాద్‌లో రిసెప్షన్ నిర్వహించనున్నారు.
తనకు కాబోయే భార్య కుటుంబానికి సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధాలు లేవని తేజ వెల్లడించాడు. వారు టెక్నాలజీ రంగంలో ఉన్నారని, ఆమె ప్రస్తుతం తన తండ్రితో కలిసి పనిచేస్తోందని చెప్పాడు. అమెరికాలో పెరిగిన ఆమెకు సినీ ప్రముఖుల ప్రపంచం, ప్రచార హడావుడి గురించి పెద్దగా పరిచయం లేదని తెలిపాడు. ఆ విషయం తనకు బాగా నచ్చిందని, పెళ్లి తర్వాత కూడా ఆమె వ్యక్తిగత జీవితానికి గోప్యత ఉండేలా చూసుకోవాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు.
తనకు కాబోయే భార్య వివరాలను మాత్రం తేజ వెల్లడించలేదు. ఆమె వ్యక్తిగత గోప్యతను కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.
'హనుమాన్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా.. ఆ తర్వాత 'మిరాయ్'తోనూ ప్రేక్షకులను అలరించాడు. సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ వ్యక్తిగత జీవితాన్ని మాత్రం కెరీర్‌కు దూరంగా ఉంచుతున్నాడు. ప్రస్తుతం ఆయన ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న 'ది ట్రైటర్స్ తెలుగు' తొలి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు.

# వెంకటేశ్ కోసం 'ఏమో ఏమో ఇది' వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ త్వరలో!

టాలీవుడ్‌లో మరో సినిమా విడుదల వాయిదా పడింది. ప్రీతి ముకుందన్, రోషన్ మేకా జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ చిత్రం 'ఏమో ఏమో ఇది' విడుదల తేదీ మారింది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే, అదే రోజున వెంకటేశ్ నటించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నంబర్: 47' విడుదల కానుండటంతో 'ఏమో ఏమో ఇది' చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని దర్శకుడు శైలేష్ కొలను సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. నటుడు వెంకటేశ్ తమ అందరి హృదయాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఆయన నటించిన 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 30న విడుదలవుతున్న నేపథ్యంలో తమ సినిమా కొత్త తేదీన ప్రేక్షకుల ముందుకు వస్తుందని తెలిపారు. కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. అప్పటివరకు సినిమా పాటలను ఆస్వాదించాలని అభిమానులను కోరారు. మరిన్ని మధురమైన పాటలు రానున్నాయని వెల్లడించారు. శైలేష్ కొలను ప్రకటనపై 'ఆదర్శ కుటుంబం' కథానాయిక శ్రీనిధి శెట్టి స్పందించారు. 'ఏమో ఏమో ఇది' చిత్రబృందానికి ప్రేమాభిమానాలు తెలియజేస్తూ, సినిమా కోసం ఎదురుచూస్తున్నానని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు, వెంకటేశ్, శ్రీనిధి శెట్టి జంటగా నటిస్తున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నంబర్: 47' చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను తొలుత అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించారు. ఆ తర్వాత అక్టోబర్ 9కి వాయిదా వేశారు. తాజాగా అక్టోబర్ 30న విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ప్రకటించింది.




# ఇమాన్వి లేటెస్ట్ లుక్.. గ్లామర్ డోస్ అదుర్స్!

సోషల్ మీడియా రీల్స్‌తో కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుని విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న బ్యూటీ ఇమాన్వి ఇస్మాయిల్ ఇప్పుడు మరోసారి ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. ఎలాంటి సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేకుండా కేవలం తన అద్భుతమైన డాన్స్ మూవ్స్, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో నేషనల్ వైడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. తాజాగా షేర్ చేసిన ఫోటోషూట్ పిక్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తున్నాయి. ఆ లేటెస్ట్ లుక్ విశేషాలు ఇప్పుడు చూద్దాం..ట్రెండీ ఆరెంజ్ డ్రెస్‌లో క్యూట్ లుక్స్: ఇమాన్వి తాజాగా పోస్ట్ చేసిన ఫోటోల్లో తనదైన స్టైల్‌లో ఫ్యాషన్ ప్రియులను ఫిదా చేశారు. ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో ఆమె బ్రైట్ ఆరెంజ్ కలర్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో మెరిసిపోయారు. స్క్వేర్ నెక్ లైన్ మరియు ఫ్లేర్డ్ స్కర్ట్ ఉన్న ఈ డిజైనర్ డ్రెస్‌లో ఆమె ప్రిన్సెస్ లాగా అందంగా కనిపిస్తున్నారు. ఇక తన డ్రెస్‌కు మ్యాచింగ్‌గా తలలో పెట్టుకున్న వైట్ బో, చెవులకు గోల్డ్ హూప్ రింగ్స్ ఆమె అందాన్ని మరింత పెంచాయి.ఖాశ్రీంశీ =ఘుఁ - ప్యారడైజ్ మార్పులు పని చేశాయా?ఖాఁజవత్‌అంవఎవత్ సింపుల్ యాక్సెసరీస్.. నాచురల్ మేకప్: ఈ ట్రెండీ లుక్‌కు తగ్గట్టుగానే ఇమాన్వి జ్యువెల్లరీని చాలా సింపుల్‌గా మెయింటైన్ చేశారు. మెడలో ఒక సన్నని లేయర్డ్ నెక్లెస్, చేతికి ఒక డెలికేట్ బ్రాస్‌లెట్, ఉంగరం ధరించి పర్ఫెక్ట్ లుక్‌ను క్రియేట్ చేశారు. జుట్టును వదులుగా విరుచుకుని, ముఖానికి సాఫ్ట్ అండ్ నాచురల్ మేకప్‌తో ఆమె మరింత గ్లామరస్‌గా కనిపిస్తున్నారు. ఇక ఈ ఫొటోల్లో ఆమె ఎక్స్‌ప్రెషన్స్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.





# చొక్కా నలగకుండా రూ.500 కోట్లు కొట్టడం రజనీకే సాధ్యం..

## 'జైలర్ 2'పై అల్లు అర్జున్ ప్రశంసలు





సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' సినిమాపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించాడు. రజనీకాంత్ స్టార్‌డమ్, స్టైల్, ఆరా ఈ సినిమాలో అద్భుతంగా కనిపించాయని కొనియాడాడు. ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచే కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఆకట్టుకుందని పేర్కొన్నాడు. ఈ సందర్భంగా చిత్రబృందానికి అభినందనలు తెలిపాడు.
ఈ మేరకు అల్లు అర్జున్ ఎక్స్ వేదికగా స్పందించాడు. "రజనీ సార్ స్టార్‌డమ్, స్వాగ్, ఆరాకు 'జైలర్ 2' నిజమైన నిదర్శనం. సినిమా ఆద్యంతం ఉత్కంఠను కొనసాగించే కమర్షియల్ ఎంటర్‌టైనర్. అనిరుధ్ అదరగొట్టాడు. నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాత ఈ సినిమా కోసం తమ హృదయాలను పెట్టి పనిచేశారు. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ అద్భుతమైన హిట్ అందించాడు. చొక్కా నలగకుండా రూ.500 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం ఒక్క రజనీగారికే సాధ్యం" అని ప్రశంసించాడు.
'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల వసూళ్ల మార్కును దాటడంతో పలువురు సినీ ప్రముఖులు ఇప్పటికే చిత్రబృందాన్ని అభినందించారు. బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ సినిమా చూసిన తర్వాత స్పందిస్తూ.. రజనీకాంత్ ఆరా మరో స్థాయిలో ఉందని అన్నాడు. థియేటర్‌లో ప్రతి ఎంట్రీకి చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ సినిమాను ఆస్వాదించానని తెలిపాడు.
ప్రముఖ నటుడు కమల్ హాసన్ కూడా తన స్నేహితుడు రజనీకాంత్‌కు అభినందనలు తెలిపాడు. సినిమా ప్రపంచవ్యాప్తంగా సూపర్‌హిట్‌గా నిలిచిందన్న వార్త సంతోషాన్ని కలిగించిందని పేర్కొంటూ దర్శకుడు నెల్సన్, సంగీత దర్శకుడు అనిరుధ్, సన్ పిక్చర్స్ బృందానికి శుభాకాంక్షలు చెప్పాడు.
జాతీయ అవార్డు గ్రహీత ధనుష్ తొలి రోజు తొలి ఆట చూసిన అనంతరం 'జైలర్ 2' తప్పక చూడాల్సిన సినిమా అని ప్రశంసించాడు. ప్రతి తలైవర్ అభిమానికీ ఇది గొప్ప విందు అని పేర్కొన్నాడు. దర్శకులు లింగుస్వామి, వెంకట్ ప్రభు, కార్తీక్ సుబ్బరాజ్ తదితరులు కూడా రజనీకాంత్ నటనను, నెల్సన్ దర్శకత్వాన్ని, అనిరుధ్ సంగీతాన్ని కొనియాడారు.